కేంద్ర మంత్రులను కలిసిన కామారెడ్డి ఎమ్మెల్యే



నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి గురువారం ఢిల్లీలో ఇద్దరు కేంద్ర మంత్రులను కలిశారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను, కేంద్ర సమాచార, బ్రాడ్‌కాస్టింగ్ శాఖ, యువజన వ్యవహారాలు, క్రీడా శాఖల మంత్రి అనురాగ్ సింగ్ ఠాగూర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పలు విషయాలపై చర్చించారు.

నవతెలంగాణ

1

నిజామాబాద్-కామారెడ్డి

శుక్రవారం | జనవరి 19, 2024 | www.navatelangana.com

సాంస్కృతిక పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో క్రీడా పోటీలు



నవతెలంగాణ-బిచ్కుంద

వివేకానంద స్వామి జయంతి ఉత్సవాల్లో భాగంగా సాంస్కృతిక పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలు గురువారం బిచ్కుంద మండల కేంద్రంలో నిర్వహించారు. కామారెడ్డి జిల్లా నోడల్ అధికారి షేక్ సలాం ఈ కార్యక్రమానికి హాజరై క్రీడా పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువతకు స్ఫూర్తిదాయకం వివేకానంద స్వామి, సుభాష్ చంద్రబోస్ అని యువత క్రీడా పోటీల్లో పాల్గొని మండల, జిల్లా స్థాయిలోనే కాక రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొని విజేతలుగా నిలిచి దేశానికి పేరు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మోహన్ రెడ్డి, ముప్పిడి వెంకట్, నాగరాజ్, రాహుల్, శ్రీకాంత్ రెడ్డి, విద్యార్థులు ఉన్నారు.

పైపైనే పనులు

- బడాపహాడ్ వద్ద మౌళిక వసతుల పనుల్లో నాసిరకం
- పర్యవేక్షణ చేపట్టని అధికారులు
- కాలువలో చెత్త చెదారం.. కుక్కల బెడద
- సమీపిస్తున్న ఉర్సు ఉత్సవాలు

నవతెలంగాణ-వర్ని

మండలంలోని బడాపహడ్ (పెద్దగుట్ట) ఉర్సు ఉత్సవాలు సమీపిస్తున్న నేపథ్యంలో అక్కడికి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా చేపట్టే పనులను నాసీరకంగా చేపడుతున్నారు. దగ్గరుండి పనులు చేయించాల్సిన వక్ఫ్‌బోర్డు అధికారులు అవేమీ పట్టించుకోవడం లేదు. దీంతో ఉర్సు ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తప్పేలా లేవని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు నాణ్యతతో చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



దర్గాకు సమీపంలోని కాలువలో పేరుకుపోయిన చెత్త..



సంచరిస్తున్న కుక్కలు

బడాపహాడ్ ఉర్సు ఉత్సవాలు సమీపిస్తున్న వేళ.. భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. వారి కోసం మౌళిక వసతులు, ఇతర సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం సుమారు రూ.12లక్షల నిధులను మంజూరు చేసింది. అయితే ఆ నిధులతో వివిధ పనులను చేపట్టాల్సి ఉంది. అందుకు గానూ అధికారులు ఆ పనులను స్థానిక ప్రజాప్రతినిధులకు కాంట్రాక్ట్ అప్పగించారు. అయితే వారి పనులను నాసీరకంగా చేపడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఉర్సుకు మూడు రోజులే ఉన్నా.. పనులు సున్నా..

బడపహాడ్ ఉర్సు ఉత్సవాలకు మరో మూడు రోజులు మాత్రమే సమయం ఉన్నది. వక్ఫ్ బోర్డు అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులకు ఒకరికి సున్నం పనులు, మరొకరికి గుంతలలో మొరం పోయటం ఇలా పలు పనులను అప్పగించారు. కానీ పనులను తుతూ మంత్రంగా చేపడుతున్నారు. రోడ్డు వెంబడి గుంతల వద్ద మొరాన్ని ఇతర ప్రాంతాల నుంచి తరలించి పూడ్చాలి. డోజర్‌తో లెవెల్ చేసి.. రోలర్‌తో తొక్కించాలి. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోడ్డు పనులు చేపట్టాలి. కానీ ప్రస్తుత కాంట్రాక్టర్ రోడ్డు పక్కనుంచే జేసీబీలతో మట్టిని తవ్వించి రోడ్డుపై పోయిస్తున్నారు. డోజర్‌తో లెవల్ చేసి వదిలేస్తున్నారు. లెవల్ పూర్తయ్యాక నీటిని పట్టి.. రోలర్‌తో తొక్కించాల్సి ఉన్నా.. ఆ పనులను చేపట్టడం లేదు.

కుక్కల బెడద..


ప్రతి శుక్రవారం, ఆదివారంతో పాటు ఇతర రోజులలో కూడా భక్తులు దర్గాను సందర్శిస్తూ ఉంటారు. ఇక్కడ భారీగా కుక్కలు సంచరిస్తుండటంతో భక్తులు భయానికి గురవుతున్నారు. మరో వైపు దర్గాకు సమీపంలోనున్న మురుగు కాలువలో చెత్తచెదారం పేరుకుపోయింది. తద్వారా దోమలు, ఈగల బెడద ఎక్కువైంది. ఇన్ని సమస్యలున్నా.. వక్ఫ్ బోర్డు అధికారులు పర్యవేక్షణ చేయడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులను నాణ్యతతో చేపట్టాలని, దర్గా పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

జీపీ కార్యదర్శి సంతకం ఫోర్జరీ

- కల్యాణలక్ష్మి కోసం..
- అధికారుల పరిశీలనతో విషయం వెలుగులోకి
- ఘటనపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన జీపీ సెక్రెటరీ

నవతెలంగాణ-లింగంపేట్

గ్రామ పంచాయతీ కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేసి.. కళ్యాణలక్ష్మి కోసం దరఖాస్తు చేసుకున్న ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన మండలంలోని పర్మళ్ల గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. పర్మళ్ల గ్రామానికి చెందిన రావుల శ్రీనివాస్ ఆరునెలల క్రితం తన కూతురు వివాహం చేశాడు. కళ్యాణ లక్ష్మి కొరకు దరఖాస్తు చేసుకోవడానికి గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్వేత వద్దకు వెళ్లాడు. పెండ్లికూతురు మైనర్ కావడంతో 18 సంవత్సరాల నిండిన తర్వాత రావాలని, అప్పటివరకు సంతకం చేయనని ఆమె సదరు వ్యక్తికి సూచించింది. దీంతో ఆ వ్యక్తి.. మరో వ్యక్తి సాయంతో గ్రామపంచాయతీ కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేసి.. గ్రామపంచాయతీ మంజూరు చేసినట్టుగా.. ఫస్ట్ మ్యారేజ్ సర్టిఫికెట్ తీసుకున్నాడు. దానికి ఇతర ధ్రువపత్రాలు జతపరిచి కల్యాణలక్ష్మి కోసం దరఖాస్తు చేశాడు. అనంతరం వీటిపై గెజిటెడ్ సంతకం అవసరం కావడంతో మండల పరిషత్ అధికారి వద్దకు వెళ్లాడు. కల్యాణలక్ష్మి సంబంధించిన పత్రాలను ఎంపీడీవో పరిశీలించి వాటిపై సంతకాలు చేశారు. కళ్యాణ లక్ష్మి పథకం సంబంధించిన ఫైల్ రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్లడంతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బాలయ్య వాటిని పరిశీలించాడు. సంబంధిత పర్మళ్ల గ్రామానికి చెందిన కార్యదర్శి శ్వేతకు ఫోన్ చేసి పెండ్లి విషయంపై ఆరాతీశాడు. దీంతో సంబంధిత కార్యదర్శి ఆ సంతకాలతో తనకు ఎలాంటి సంబంధం లేదని తెలపడంతో అసలు విషయం బయటపడింది. ఈ విషయమై బుధవారం గ్రామపంచాయతీ సిబ్బందితో కార్యదర్శి ఆరా తీసినా.. ఎవరూ ఎలాంటి సమాధానం చెప్పకపోవడంతో గురువారం లింగంపేట్ ఎమ్మార్వో సుధాకర్‌కు, ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీవో ప్రభాకర్‌చారికి ఫిర్యాదు చేశారు. దీనిని పరిశీలించి అధికారులు చర్యలు తీసుకోనున్నట్టు తెలుస్తోంది.



తప్పుడు సంతకంతో కూడిన దరఖాస్తు

ఆధార్ కేంద్రానికి అడ్డంగా..
తహసీల్దార్ కారు



నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని పాత పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసి తహసీల్ సేవలను కొనసాగిస్తున్నారు. ఈ భవనంలోనే ప్రజల సౌకర్యం కొరకు అధికారులు ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఆధార్ సెంటర్‌కు ప్రతి నిత్యం పదుల సంఖ్యలో వినియోగదారులు వస్తుంటారు. ఉన్నది చిన్నపాటి రూమ్ దాని ఎదురుగా గురువారం మండల తహసీల్దార్ తన కారును ఆధార్ కేంద్రానికి అడ్డంగా పెట్టడంతో ఆధార్ కేంద్రానికి వచ్చిన వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆధార్ కేంద్రం ముందు కారును ఎందుకు పెట్టారని వినియోగదారులు తహసీల్ సిబ్బందిని ఆడిగితే 'బయట ఎండకు కారు పెడితే రంగు పోతుందని తహసీల్దార్ అన్నారు' అని సిబ్బంది సమాధానం ఇవ్వడంతో అక్కడున్న వారు నివ్వెరపోయారు.

రైతుల ఖాతాల్లో రైతుబంధు

- రూ.50కోట్ల 62 లక్షల 52 వేలు జమ
- డీఏఓ భాగ్యలక్ష్మి



నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

రైతుల ఖాతాలో రైతుబంధు డబ్బులు లక్షా 57 వేల 373 రైతులకు రూ.50 కోట్ల 62 లక్షల 52 వేలు జమ చేసినట్టు జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని భాగ్యలక్ష్మి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా రైతుల ఖాతాల్లో రైతుబంధు డబ్బులు రెండెకరాల వరకు జమ చేసినట్టు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా లక్ష ఇరవై వేల మందికి రైతుబంధు డబ్బులు రావాల్సి ఉందని త్వరితగతిన ఆ ప్రక్రియ పూర్తవుతుందని ఆమె అన్నారు. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా రెండు లక్షల 60 వేల ఎకరాలలో పంటలు సాగు అంచనా వేశామని, ఇప్పటివరకు 90 వేల ఎకరాలలో నాటు వేశారని తెలిపారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఎర్రపహాడ్‌లో గల రైతువేదికలో వీసీ ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఆమె వెంట ఎల్లారెడ్డి ఏడీఏ రత్నం ఉన్నారు.

మొక్కలకు రెండు సార్లు నీటిని పట్టాలి

- ఎంపీడీవో బాలకిషన్

నవతెలంగాణ-రాజంపేట్



మాట్లాడుతున్న ఎంపీడీవో బాలకిషన్

నర్సరీలో మొక్కలకు రోజుకు రెండు సార్లు నీటిని పట్టాలని ఎంపీడీవో బాలకిషన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో గ్రామపంచాయతీ కార్యదర్శులకు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లతో మండల పరిషత్ ప్రణాళిక, గ్రామపంచాయతీ ప్రణాళికపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నర్సరీలో వేప, కానుగ మొక్కలు పెంచి వాటికి సంబంధించిన మెయింటెన్ రిజిస్టర్ కూడా రాయాలని, త్వరలోనే సెంట్రల్ టీం వచ్చే అవకాశం ఉందన్నారు. కొన్నిచోట్ల ప్రైమరీ బెడ్స్‌లో సీటు వేయకుండా ఉన్నచోట వెంటనే సీడ్ వెయ్యాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ రఘురాం, భాస్కర్, టిఏలు పాల్గొన్నారు.

ఓటర్ నమోదును సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-మద్నూర్

అర్హులైన యువతీయువకులు ఓటర్ నమోదును సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. ఈనెల 20, 21 తేదీలలో మండల పరిధిలోని ప్రతి బూతులో దరఖాస్తులు స్వీకరించేందుకు ప్రత్యేక క్యాంపియన్ నిర్వహించేందుకు గానూ గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బూతులెవల్ అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బూతులెవల్ అధికారులకు ప్రత్యేక క్యాంపియన్‌పై డిప్యూటీ తహసీల్దార్ భరత్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శంకర్, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ విజయ్ కొత్త ఓటర్ల నమోదు దరఖాస్తుల స్వీకరణ, ఓటర్ల ఐడెంటి కార్డులో తప్పులు సరిదిద్దుకునేందుకు ఫామ్ 8 దరఖాస్తుల స్వీకరణపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు.

నేడు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-రెంజల్

మండలానికి మంజూరైన 37 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను బోధన్ పట్టణంలోని ఆచన్‌పల్లిలోని అయేషా ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో చెక్కులు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ రామ్‌చందర్ తెలిపారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కొత్త వరి వంగడాలు వేసుకునేలా
రైతులను ప్రోత్సహించాలి

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి

రైతులు కొత్త వరి వంగడాలు వేసుకునే విధంగా వ్యవసాయ అధికారులు ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. గురువారం కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం క్యాలెండర్, డైరీని కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలైన పశువుల పెంపకం, చేపల చెరువులు ఏర్పాటు చేసుకొని అదనంగా ఆదాయం పొందే విధంగా చూసుకోవాలన్నారు. జొన్న పండించే రైతులు అదనంగా ఉత్పత్తులు తయారుచేసి మార్కెటింగ్ చేస్తే గిట్టుబాటు ధర పొందే వీలుందని సూచించారు. రైతులు చిరుధాన్యాలు, కూరగాయల సాగును చేపట్టే విధంగా వ్యవసాయ అధికారులు ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం చైర్మన్ భాగ్యలక్ష్మి అధ్యక్షుడు ఎస్. నరసింహులు, ఏడీఏలు రత్న, అపర్ణ, భారతి, వ్యవసాయ అధికారులు ప్రజాపతి, హరీష్ కుమార్, శ్రీకాంత్, విజయ శేఖర్, పవన్, రాధా, రమ్య పాల్గొన్నారు.



క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న ఐద్వా నాయకులు

18 ఏండ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలి..

ఈ నెల 20, 21న నిర్వహించే ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో 18 ఏండ్లు నిండిన ప్రతి యువత ఓటరుగా నమోదు చేసుకునేలా ప్రోత్సహించవలసినదిగా జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంపై ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ఐదేండ్లకు ఒక సారి ఓటు హక్కు వేసే అవకాశం లభిస్తుందని, త్వరలో జరగబోయే పార్లమెంటు ఎన్నికలలో నూతన ఓటరుగా నమోదై ఓటు హక్కు వినియోగించుకునేలా యువతకు అవగాహన కలిగించాలని కోరారు. వచ్చే శని, ఆదివారాలలో జిల్లాలోని 913 పోలింగ్ కేంద్రాలలో బూతుస్థాయి అధికారులు ఫారం 6,7,8 దరఖాస్తులతో అందుబాటులో ఉంటారని, ప్రతి పోలింగ్ కేంద్రాలలో ఏజెంట్లు ఏర్పాటు చేసి అర్హులైన యువత ఓటరుగా నమోదయ్యేలా చూడాలన్నారు. ప్రధానంగా చదువుకున్న యువత తమ మొబైల్‌లో ఓటరు హెల్ప్‌లైన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకొని ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కలిగించాలన్నారు. దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు, మహిళలు ఓటరుగా నమోదు చేసుకునేలా చూడాలని కోరారు. అదేవిధంగా ఓటరు ముసాయిదా జాబితాను పరిశీలించి మార్పులు, చేర్పులు, సవరణలు, తొలగింపులు ఉంటే ఫారం 7, 8 ద్వారా సరిచేసుకునేలా చూడాలని, ముఖ్యంగా ఓటరు జాబితాలో ప్రముఖుల పేర్లు గల్లంతు కాకుండా చూడాలన్నారు. గత శాసనసభ ఎన్నికల సందర్భంగా గుర్తించిన అంశాలను పరిగణలోకి తీసుకొని డూప్లికేట్ ఓటర్లను, చనిపోయిన ఓటర్లను, సిమిలర్ ఫోటో ఎంట్రీ, డెమోగ్రాఫికల్ సిమిలర్ ఎంట్రీ ఓటర్లను గుర్తించామని, వారికి స్పీడ్ పోస్ట్ ద్వారా నోటీసులు ఇచ్చి తొలగించే ప్రక్రియ ముమ్మరంగా సాగుతున్నదని అన్నారు. వివిధ పోలింగ్ కేంద్రాలలో ఉన్న ఒకే కుటుంబం వారిని వారి అంగీకారంతో ఒకే పోలింగ్ కేంద్రానికి షిఫ్ట్ చేయనున్నామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు జూకంటి ప్రభాకర్‌రెడ్డి, మదన్‌లాల్ జాదవ్, మహమ్మద్ జఫ్ఫార్ ఖాన్, అవధూత నరేందర్, కాసిం అలీ, బట్టేనికి బాలరాజ్, అనిల్‌కుమార్, ఎలక్షన్ సూపరింటెండెంట్ అనిల్‌కుమార్, ఎన్నికల సిబ్బంది జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కోసం రైతులు ఆందోళన చెందవద్దు

- జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్

నవతెలంగాణ-బోధన్



పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

యాసంగి సీజన్లో భాగంగా రైతులకు కావలసిన ఎరువులు అందు బాటులో ఉన్నాయని కావున రైతులు ఎరువుల కోసం ఎలాంటి ఆందోళన చెందవద్దని జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్ అన్నారు. గురువారం ఆయన బోధన్ మండలంలోని బెల్లాల్ గ్రామ శివారులో యాసంగిలో రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి పంటలకు చీడపీడలు ఆశించకుండా జాగ్రత్తలు చేపట్టాలన్నారు. అలాగే పంట ఎదుగుదలకు చేపట్టవలసిన చర్యలను వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకోవాలని అన్నారు. అనంతరం యాసంగిలో వ్యవసాయ విస్తరణ అధికారులు నమోదు చేసిన పంట సర్వే నంబర్లును, ఆ సర్వే నంబర్స్‌లో వేసిన పంటలను ర్యాండమ్‌గా 15 సర్వే నంబర్లును తనిఖీ చేశారు. ఈ క్షేత్ర సందర్శనలో ఆయన వెంట ఏఈఓ గంగాజల, రైతులున్నారు.

కేంద్ర ప్రభుత్వం వివక్షతపై టీజేఎస్ రాష్ట్ర సదస్సు

- తెలంగాణ జన సమితి కామారెడ్డి జిల్లా అధ్యక్షులు కుంభాల లక్ష్మణ్ యాదవ్

నవతెలంగాణ-కామారెడ్డి



రాష్ట్ర సదస్సు పోస్టర్ల ఆవిష్కరణ

రాష్ట్ర విభజన హామీలు అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై వివక్షత చూపడాన్ని నిరసిస్తూ జన సమితి ఆధ్వర్యంలో చేపట్టే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని తెలంగాణ జన సమితి కామారెడ్డి జిల్లా అధ్యక్షులు కుంభాల లక్ష్మణ్ యాదవ్ అన్నారు. ఈ నెల 21న తెలంగాణ జన సమితి రాష్ట్ర సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను కామారెడ్డి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ముందు ఆవిష్కరించారు. ఈ సదస్సును తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షులు కోదండరాం ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సదస్సుకు ఉద్యమకారులు, మేధావులు, తెలంగాణవాదులు, ప్రజలు, జర్నలిస్టులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. విభజన హామీలు తక్షణమే అమలయ్యే విధంగా కేంద్ర ప్రభుత్వంపై ఆ సదస్సులో ఒత్తిడి తెచ్చే విధంగా సదస్సు నిర్వహించుకుందామన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడపాలి

నవతెలంగాణ-భిక్కనూర్

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించి వాహనాలు నడపాలని, పోలీస్, మోటార్ వెహికల్ అధికారులకు సహకరించాలని ఎస్సై సాయికుమార్ సూచించారు. గురువారం రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా స్థానిక టోల్‌ప్లాజా వద్ద వాహనదారులకు, ప్రజలకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి వాహనాన్ని నడపాలని, ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఏఎంబివి జయంత్, శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన వ్యవసాయ అధికారులు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని రామేశ్వరపల్లి గ్రామంలో రైతుల సాగుచేసిన వరి పంటను మండల వ్యవసాయ అధికారిని రాధా గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పంటలకు సోకుతున్న తెగుళ్ల గురించి రైతులు వివరించారు. అధునాతన పద్ధతులలో పంటలు సాగు చేయాలని, రైతులు సాగుచేసిన పంటలకు ఎలాంటి పురుగు సోకిన వ్యవసాయ సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారి వినోద్, రైతులు ఉన్నారు.

డ్రోన్‌తో పురుగుల మందు పిచికారీ



డ్రోన్‌తో పిచికారీ చేసిన దృశ్యం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామంలో డ్రోన్‌తో వరి పంటకు పురుగుల మందు పిచికారీ చేశారు. కూలీల కొరతతో పాటు ధరలు పెరగడం వల్ల రైతులు ఇలాంటి అధునాతన పద్ధతులపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు. రిలయన్స్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సబ్సిడీపై డ్రోన్‌తో పురుగుల మందు పిచికారీ చేస్తున్నారు. వరి పంటకు డ్రోన్ కెమెరా సహాయంతో పురుగుల మందు పిచికారీకి ఎకరాకు 400 రూపాయలు ఖర్చవుతుందని తెలిపారు. అనంతరం రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. రైతులకు సబ్సిడీపై పలు రకాల సేవలను అందిస్తున్నామని, తాము అందిస్తున్న సబ్సిడీ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ముస్తాపూర్‌లో స్వచ్ఛతపై కళాజాత

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని ముస్తాపూర్ గ్రామంలో గురువారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్వచ్ఛభారత్ ఆధ్వర్యంలో స్వచ్ఛతపై కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ సాంస్కృతిక సాధన కళాకారులు ఆటపాటలతో మరుగుదొడ్ల వినియోగంపై గ్రామస్తులకు వివరించారు. ప్రతి ఒక్కరూ మరుగుదొడ్డిని వాడాలని సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ సంస్కృత సాధన కళాకారులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విపిఆర్పిపై వివోఏలకు శిక్షణ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

విపిఆర్పిపై వీఓఏలకు శిక్షణ ఇచ్చినట్లు రవీందర్ రెడ్డి గురువారం తెలిపారు. మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో వీవోఏలతో సమీక్ష సమావేశం ఏపిఎం రవీందర్ రెడ్డి గురువారం నిర్వహించారు. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, న్యూ ఎంటర్ప్రైజెస్, తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో డిఎంజి జనార్ధన్, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, వివోఏలు, మండల సమైక్య సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారులు

నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ముస్కు భూమేశ్వర్‌రెడ్డి గురువారం నవతెలంగాణ 2024 క్యాలెం డర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ.. ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పనిచేస్తున్న ముఖ్య మైన దినపత్రికల్లో నవతెలంగాణ పత్రిక ఒకటన్నారు. నవతెలంగాణ పత్రిక రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు గైని సాయన్న, మాజీ గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, నేర రాజేశ్వర్, ఆనంద్‌గౌడ్, లింగపురం చిన్నయ్య ద్యావతి శివలింగం, గైనిమణి, బిజ్జిగంగాధర్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



అంతక్రియలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని అర్గుల్ గ్రామానికి చెందిన సూర్య సురేష్ మాజీ జెడ్పిటిసి తల్లి మృతి చెందడంతో మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ గురువారం అంత్యక్రియల్లో పాల్గొని కుటుంబాన్ని ఓదార్చారు. కార్యక్రమంలో మండల కో ఆప్షన్ నెంబర్ బులెట్ అక్బర్ ఖాన్, మాజీ వైస్ ఎంపీపీ జితేందర్ సింగ్, మండల బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మహిపాల్‌రెడ్డికి నివాళి



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఏలేటి అన్నపూర్ణమ్మ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని చౌట్‌పల్లిలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ అటవీ శాఖ మంత్రి ఏలేటి మహిపాల్ రెడ్డి 33వ వర్ధంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఉన్న మహిపాల్ రెడ్డి ఘాట్ వద్ద ఆయన సతీమణి, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఏలేటి అన్నపూర్ణమ్మ, తనయులు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, బాల్కొండ బిజెపి నాయకులు డాక్టర్ ఏలేటి మల్లికార్జున్ రెడ్డి, ఏలేటి నాగార్జున్‌రెడ్డి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మహిపాల్‌రెడ్డి సమాధిపై పూలమాలలు వేసి జ్యోతిని వెలిగించారు. అనంతరం ఈ ప్రాంతంలో మహిపాల్ రెడ్డి చేసిన సేవలను నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి జీ.వి. నరసింహారెడ్డి, బాల్కొండ అసెంబ్లీ కన్వీనర్ మల్కాన్నగారి మోహన్, నిజామాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మల శ్రీనివాస్, మండల అధ్యక్షులు కట్ట సంజీవ్ కుమార్,బిజెపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నవనాథ సిద్దేశ్వర పిరమిడ్ సందర్శన



నవనాథ సిద్దేశ్వర పిరమిడ్‌ను సందర్శించిన శివప్రసాద్

నవతెలంగాణ-ఆర్మూర్

సుప్రసిద్ధ దేవస్థానం సిద్దులగుట్టలో నిర్మిస్తున్న తెలంగాణ రాష్ట్రంలో అతిపెద్ద రెండవ పిరమిడ్ శ్రీ నవనాథ సిద్దేశ్వర పిరమిడ్ ధ్యాన మహా శక్తి క్షేత్రాన్ని మహేశ్వర మహా పిరమిడ్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి బ్రాహ్మణ రత్న శ్రీమారం శివప్రసాద్ గురువారం సందర్శించారు. జగద్గురువు బ్రహ్మర్షి పితామహ సుభాష్ పత్రీజీ గారి ఆలోచన మేరకు గొప్ప క్షేత్రమైన సిద్దుల గుట్టపై ఎంతో అద్భుతమైన ధ్యాన మందిరాన్ని నిర్మించడం చాలా గొప్ప విషయమని అన్నారు. ప్రారంభించిన అతి తక్కువ సమయంలో పనులను పూర్తి చేయడం పిరమిడ్ సొసైటీలో గొప్ప విజయం అని తెలిపారు. సిద్దుల గుట్టపై ఉన్న ఈ పిరమిడ్ ధ్యాన మందిరం ఎంతో గొప్ప శక్తి క్షేత్రమని, ప్రపంచంలో ఉన్న అన్ని పిరమిడ్ ధ్యాన మందిరాల్లో ఇంత పెద్ద కొండపై ఈ పిరమిడ్ నిర్మించడం గొప్ప విషయమని అన్నారు. కార్యక్రమంలో పి ఎస్ ఎస్ ఎం జిల్లా అధ్యక్షులు అడ్వకేట్ సాయి కృష్ణ రెడ్డి, సభ్యులు పెంబర్తి నారాయణ, రాజారాం, కూనింటి శేఖర్ రెడ్డి, ప్రేమ్‌కుమార్, భీమన్న, నాగన్న, ప్రకాష్ నంద, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మహేష్‌కుమార్‌గౌడ్‌కు సన్మానం



సన్మానిస్తున్న నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఎమ్మెల్యే కోట ఎమ్మెల్సీ ఉపఎన్నికలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా నిజామాబాద్ జిల్లా వాస్తవ్యులు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ని నియమించిన సందర్భంగా బోధన్ ఎమ్మెల్యే మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, మాజీ ప్రభుత్వ విప్ ఈరవత్రి అనిల్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి కలిసి గురువారం మహేష్‌కుమార్‌గౌడ్‌ని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. వారితో పాటు పిసిసి ఉపాధ్యక్షులు తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ నాయకులు అన్వేష్‌రెడ్డి, పిసిసి డెలిగేట్ శేఖర్‌గౌడ్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు అంతిరెడ్డి రాజారెడ్డి, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గంగారెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలలో సంక్రాంతి సంబరాలు



కృష్ణవేణి పాఠశాలలో సంక్రాంతి సంబురాలు

నవతెలంగాణ-ముప్కాల్

మకర సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గురువారం మండల కేంద్రంలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు రంగవల్లులు, పతంగుల పోటీలను నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల వేషధారణలతో ఆటపాటలతో అలరించారు. పాఠశాల ఆవరణలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ఉపాధ్యాయులు, విద్యార్థులకు సంక్రాంతి విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కోట ప్రవీణ్, వైస్ ప్రిన్సిపాల్ రాజేందర్ చవాన్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- **నిజామాబాద్ పార్లమెంటు సభ్యులు అరవింద్**

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిజామాబాద్ పార్లమెంటు సభ్యులు ధర్మపురి అరవింద్ అన్నారు. గురువారం మండలంలోని హాస కొత్తూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ ఏనుగు పద్మ రాజేశ్వర్ అధ్యక్షతన నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో ఎంపీ అరవింద్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు పీఎం కిసాన్, ఉజ్వల యోజన, ముద్ర లోన్, ఆయుష్మాన్ భారత్ లాంటి పథకాలను కేంద్రంలోని ప్రధానమంత్రి మోడీ ప్రభుత్వం అమలు పరుస్తుందని అన్నారు. అర్హులైన లబ్ధిదారులు కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఆర్థిక పరిపుష్టి సాధించాలని ఆకాంక్షించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందేలా చూడాలని అధికారులకు సూచించారు. సర్పంచ్ ఏనుగు పద్మ రాజేశ్వర్ మాట్లాడుతూ కేంద్రం నుండి అందించే సంక్షేమ పథకాలు పొందాలంటే అట్టి శాఖకు సంబంధించి వివరాలను గ్రామ కార్యదర్శిని సంప్రదించి అర్హులైన వారందరూ దరఖాస్తు చేసుకుని లబ్ధి పొంది ఆర్థికంగా నిలదొక్కుకోవాలని సూచించారు. అనంతరం ఎంపీ అరవింద్ పీఎం కిసాన్, ఉజ్వల యోజన, ముద్ర లోన్, ఆయుష్మాన్ భారత్ పథకాల లబ్ధిదారులతో ఎంపీ ముచ్చటించారు. మోడీ క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో తహసిల్దార్ ఆంజనేయులు, ఎంపిడిఓ సంతోష్ రెడ్డి, జాతీయ సమాచార అధికారి, మండల ప్రత్యేక అధికారి యోహాన్ , భీంగల్ ఏడిఏ మల్లయ్య, ఐకెపి ఏపిఎం కుంట గంగారెడ్డి, పంచాయతీ కార్యదర్శి నర్సయ్య, పంచాయతీ పాలకవర్గం సభ్యులు, మండల, గ్రామ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ ధర్మపురి అరవింద్

ఎండలోనే వికసిత్ భారత్ కార్యక్రమం

- **వచ్చిన వారికిఎండలో కూర్చుండబెట్టిన వైనం**

నవతెలంగాణ-ధర్పల్లి

కేంద్రప్రభుత్వం దేశ ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, వాటిని ఎలా పొందాలో.. వాటికీ ఎవరు అర్హులు.. వాటిని పొందేవిధానం గురించి కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించేందుకు చేపట్టుతున్న కార్యక్రమాన్ని అధికారులు నీరు గార్చుతున్నట్లు కనిపిస్తుంది. గురువారం మండలంలోని మరియా తండాలో ఎంపిడిఓ కొండా లక్ష్మణ్ అదక్షతన ఏర్పాటు చేసిన వికసిత్ భారత్ కార్యక్రమానికి వచ్చిందే కొందరు తండా వాసులు. వారికికూడా కూర్చోడానికి కుర్చీలు లేక ఒక టార్పాలిన్ కింద పరిచి ఎండలో కూర్చుండబెట్టి అధికారులు కార్యక్రమం కానిచ్చేద్దాం అనుకున్నారేమో.. కానీ అక్కడి ప్రజలు తమకు ఎండలో కూర్చుండబెట్టి సమావేశం ఎలా ఏర్పాటు చేశారంటూ అధికారులకు ప్రశ్నించారు. అక్కడే ఉన్న ఎంపిడిఓ లక్ష్మణ్ తమకేమీ నిధులు వస్తలేవు.. టెంట్లు, కుర్చీలు వెయ్యండని, సర్పంచ్ తన సొంత ఖర్చులతో కార్యక్రమం నిర్వహిస్తున్నారని ప్రజలపై ఆగ్రహంతో సమాధానం ఇచ్చారు. ఇంతలో అక్కడే ఉండి ఇదంతా గమనిస్తున్న ఓయువకుడు కలుగ జేసుకొని కేవలం మీరు కూర్చోడానికేనా టెంట్లు వేసుకున్నది అని ప్రశ్నించారు. మరి మేమె ఎండలో కూర్చుంటాం.. మీరే నీడకు రండి అంటూ దురుసుగా సమాధానం ఇచ్చారు. ప్రభుత్వం మాకు నిధులిస్తే పెద్దది టెంటు వేసి ,కుర్చీలు వేసి కూర్చోపెట్టుతామని అసహనంగా అధికారి సమాధానం ఇచ్చారు. సభకు వచ్చిన తండావాసులు కోపోద్రిక్తులై ఎవరి దారిన వాళ్ళు వెళ్లే సమయంలో తూ.. తూ మంత్రంగా ఆదరాబాదరాగా అధికారులు కార్యక్రమాన్ని ముగించుకొని వెళ్లిపోయినట్లు తండావాసులు వాపోయారు. సదరు అధికారికి వత్తాసు పలికిన ఎంపీఓ రాజేష్‌పై సైతం తండావాసులు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ప్రజలకు సర్ది చెప్పడం మానుకొని వారిపైనే దురుసుగా వ్యవరించడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారి పనితీరు మార్చుకోవాలని కోరుతున్నారు. అధికారులు ప్రజలతో మమేకమై పాలన కొనసాగించాలని, అప్పుడే ఇటు ప్రభుత్వాలతో పాటు అధికారులకు మంచి పేరు వస్తుందని ప్రజలు తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

ఆలయ నిర్మాణానికి ఎన్నారై రూ.50వేల విరాళం



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి ఆలయానికి జగిత్యాల జిల్లా మెట్ పల్లి మండలం ఫ్యాక్టరీ చిట్టాపూర్ గ్రామానికి చెందిన ఎన్నారై బద్దం సంజీవరెడ్డి (కెనడా) రూ. 50వేలు విరాళంగా అందజేశారు. ఈ మేరకు గురువారం విరాళం మొత్తాన్ని కమ్మర్‌పల్లిలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు బద్దం రాజశేఖర్, సింగిరెడ్డి శేఖర్, ముత్యంరెడ్డి, ధర్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న

ఆటోవాలాలపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

విద్యార్థుల జీవితాలతో చెలగటం ఆడుతున్న ఆటో వాలాలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ నగర అధ్యక్షులు అఖిల్ అధ్వర్యంలో ఏసిపి సిఎస్ఎస్ విజయసారధికి గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నగర అధ్యక్షుడు అఖిల్ మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లాలో పలు ఆటోవాలాలు పరిమితికి మించి విద్యార్థులని ఎక్కచుకొని పాఠశాలలకు తరలిస్తున్నారని అన్నారు. ఈ తరుణంలో అనేక యాక్సిడెంట్లు జరుగుతున్నయని తెలిపారు. కొన్ని రోజుల క్రితం జక్రాన్‌పల్లి మండలం సికింద్రాపూర్ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు బాల్ నగర్ నుండి ఆటోలో స్కూల్‌కి వెళ్తుండగా 14 మంది చిన్నారులు ప్రమాదానికి గురై ఆస్పత్రి పాలయ్యారన్నారు.

. పరిమితికి మించి విద్యార్థులను స్కూలుకు తరలిస్తున్న ఆటోల లైసెన్స్ సీజ్ చేయాలని ఆ ఆటో డ్రైవర్‌కు చట్టరిత్యా శిక్ష వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహేష్, సుజిత్, సోహెల్, తదితరులు పాల్గొనారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

బిసి కులాల జనగణన కోసం ఉద్యమం

- **బహుజన లెఫ్ట్ పార్టీ బిఎల్(పి)**

నవతెలంగాణ-కంఠేశ్వర్

కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆరు నెలల్లో బిసి కులాల జనగణన చేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం ప్రకారం బిసి కులాల జనగణన సర్వేకు సన్నాహాలను ప్రారంభించాలని బహుజన లెఫ్ట్ పార్టీ-బిఎల్(పి) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్ కోరారు. గురువారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ రోడ్లు, భవనాల అతిథి గృహంలో జరిగిన బహుజన లెఫ్ట్ పార్టీ(బిఎల్‌పి) జిల్లా కమిటి సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సమాజంలో బిసి, ఎస్సీ, ఎస్టీ, అగ్రకుల పేదలైన బహుజనులు 93శాతం ఉంటే, బిసి కులాలు 65శాతం ఉన్నాయని తెలిపారు. తాను బిసి అని చెప్పుకునే ప్రధాని మోడీ బిసి కులాల జనగణన విషయంలో ఎందుకు వెనకడుగు వేస్తున్నారని ప్రశ్నించారు. సమావేశంలో బహుజన లెఫ్ట్ పార్టీ-బిఎల్(పి) రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.సిద్ధిరాములు, బహుజన లెఫ్ట్ మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ సబ్బని లత, జిల్లా ప్రధాన కార్యదర్శి దండు జ్యోతి, బిఎల్(పి) జిల్లా కన్వీనర్ కె.మధు, కోకన్వీనర్ అబ్బగోని అశోక్‌గౌడ్, సయ్యద్, జిల్లా నాయకులు బి.జగదీష్, బాల్‌రాజ్, నిజామాబాద్ నగర అధ్యక్షులు ఎం.అజయ్, నాయకులు టి.రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బిఎల్(పి) నాయకులు

గురుకుల బాలికల పాఠశాలలో అడ్మిషన్లకు ఆహ్వానం

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని మైనారిటీ పాఠశాల, కళాశాలలో 2024-2025 సంవత్సరానికి అడ్మిషన్స్ ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ వాణి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎంపీసీలో 30 సీట్లు, బైపిసిలో 30 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. మైనార్టీ పాఠశాలలో ఐదవ తరగతిలో మొత్తం 40 సీట్లకు గాను 30 మైనారిటీ సీట్లు, అందులో 28 ముస్లిం మైనారిటీ సీట్లు, క్రిస్టియన్ మైనారిటీ 2సీట్లు ఉన్నాయని, మిగతా 10 నాన్ మైనారిటీ సీట్లు ఉన్నట్టు తెలిపారు. 6,7,8,9 తరగతుల వారిగా సీట్లు ఉన్నాయని అర్హులైన విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం తమ మైనారిటీ పాఠశాల, జూనియర్ కళాశాలలో సంప్రదించాలని ఆమె తెలిపారు. బాల్కొండ మైనారిటీ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ గ్రూపులు మాత్రమే ఉన్నాయని పేర్కొన్నారు.

మల్టీఫుల్ డిజేబుల్‌పై అవగాహన

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో వివోఏలకు మల్టిపుల్ డిసేబుల్‌పై ఫిజియోథెరపీ డాక్టర్ నవీన్ అవగాహన కల్పించారు. అన్ని రకాల వైకల్యంపై ఫిజియోథెరపీ డాక్టర్ నవీన్ వివరిస్తూ శారీరక, మానసిక, బుద్ధి మాంద్య వికలాంగులు పలు రకాల వైకల్యంపైనా వివరించారు. పుట్టినరోజు నుంచి ఆరు సంవత్సరాల వరకు ఎటువంటి వికలత్వం ఉన్న ఫిజియోథెరపీ ద్వారా నయం చేయవచ్చని అన్నారు. పోషకాహారం లోపం వల్ల వైకల్యంగల పిల్లలు పుడుతున్నారని, అంగన్వాడీ ద్వారా అందించే పౌష్టికాహారాలు గర్భిణీ స్త్రీలు, చిన్నపిల్లలకు సక్రమంగా అందించి వైకల్యాన్ని రూపుమాపాలని తెలిపారు. సర్జరీ అవసరం ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, ఆరోగ్యశ్రీ ద్వారా కొన్ని హాస్పిటల్‌లో చాలా సౌకర్యాలు ఉన్నాయన్నారు. మండలంలో వైకల్యం గల చిన్నపిల్లలను మండల కేంద్రంలోని ఐకెపి ఆధ్వర్యంలో కొనసాగుతున్న శుభోదయం పాఠశాలకు పంపించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం రవీందర్‌రెడ్డి కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, వీవోఏలు ఉన్నారు.



మాట్లాడుతున్న ఫిజియోథెరపీ డాక్టర్ నవీన్

సీఎంఆర్ ధాన్యాన్ని గడువులోగా అందించాలి

- **రైస్ మిల్లులు తనిఖీలో తహసీల్దార్**



నవతెలంగాణ-బాల్కొండ

2022-23 సంవత్సరానికి సంబంధించిన ఖరీఫ్, రబీకి సంబంధించిన కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) ధాన్యాన్ని గడువులోగా ప్రభుత్వానికి అందించాలని తహసీల్దార్ శ్రీధర్ రైస్ మిల్లుల యజమానులకు ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని రైస్ మిల్లులను గురువారం తహసీల్దార్ శ్రీధర్ తనిఖీ చేశారు. మండల పరిధిలోని నాగపూర్ శివారులో గల శ్రీ లక్ష్మీనరసింహ రైస్ మిల్లు, కిసాన్‌నగర్‌లోని భూమేశ్వర్ రైస్ మిల్లులను తనిఖీ చేశారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ రాఘవేందర్, రెవిన్యూ సిబ్బంది ఉన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

తెలుగుదేశం పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు దేగాం యదాగౌడ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ 28వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అర్బన్ కన్వీనర్ అంబిక సత్యనారాయణ ఆధ్వర్యంలో దుబ్బ ప్రాంతంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పార్లమెంట్ అధ్యక్షులు దేగాం యదాగౌడ్ మాట్లాడుతూ.. నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీ పెట్టి దేశ రాజకీయాల పైన చెరగని ముద్ర వేశారని అన్నారు. పార్టీ పెట్టిన తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి వచ్చిన మొట్టమొదటి పార్టీ తెలిపారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతో తెలుగు రాష్ట్రాలు అభివృద్ధి బాటన పడ్డాయని అన్నారు. కార్యక్రమంలో అర్బన్ ఇంచార్జ్ వినోద్ కుమార్, అర్బన్ కో కన్వీనర్లు కల్లేడ బండారి గంగాధర్, కొయ్యడ నర్సింలుగౌడ్, పార్లమెంట్ కమిటీ నాయకులు, రెంజర్ల సురేష్, జ్యోతి నారాయణ, బీసీ సెల్ అధ్యక్షులు దంతాల ఆనంద్, ఎక్స్ ఎంపిటిసి గోవర్ధన్‌గౌడ్, అర్బన్ నాయకులు లవంగ రాజు, నవటే నర్సయ్య లక్ష్మి యాదవ్, సర్ఫరాజ్, రాములు, గంగ సాగర్, గణేష్, సాయిలు, సలీం, ప్రభాకర్, గంగాధర్, మల్లేష్, చెరుకు గంగాధర్, నరేందర్, హజి, అబ్దుల్ ఫిరోజ్, తదితరులు పాల్గొన్నారు.




ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

బాల్కొండ: మండల పరిధిలోని వన్నెల్(బి) గ్రామంలో గురువారం నందమూరి తారక రామారావు 28వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో అభిమానులు నాగులపల్లి రాజేశ్వర్, గాదెపల్లి రాజేందర్, వెల్మ రమేష్, మిట్టపల్లి నర్సారెడ్డి, ఎంపీటీసీ భోజరెడ్డి, కొత్తపల్లి దేవేందర్, హైమద్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో 11న ప్రవేశపరీక్ష

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని మహాత్మాజ్యోతీభాపూలే గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు సంబంధించి ఉమ్మడి జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ సత్యనాథ్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి 6,7,8వ తరగతుల్లో ఖాళీ సీట్లలో ప్రవేశాలకోసం BC, ST, SC, EBCలలో అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కాగా దరఖాస్తుకు ఈనెల 20 వరకు గడువు పొడిగించగా ఫిబ్రవరి 11న ప్రవేశపరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

గ్రామపంచాయతీ ప్రణాళికపై సమావేశం



నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో రూపొందించాల్సిన ప్రణాళికపై గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఎల్లారెడ్డి డిఎల్‌పిఓ సురేందర్ ఆధ్వర్యంలో మండలస్థాయి అధికారులు సమావేశం నిర్వహించారు. జిపిడిపిపై సమగ్రంగా చర్చించారు. అదేవిధంగా గ్రామాలలో పేరుకుపోయిన బకాయిలు వెంటనే వసూలు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. అదేవిధంగా ఎస్‌బిఎంవి డబ్ల్యూఎస్సీ వంటి అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రఘు, శ్రీనివాస్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు సన్మానం



సన్మానిస్తున్న జడ్పీటీసి

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని తాండూర్ గ్రామం నుంచి శబరిమలై కాలినడకన వెళ్లి దర్శనం చేసుకున్న అయ్యప్ప స్వాములకు గురువారం మండల కేంద్రంలో జెడ్పీటీసి మనోహర్‌రెడ్డి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాండూర్ గ్రామానికి చెందిన భీమ్ రెడ్డి, వడ్ల సతీషమ్మ, సతీష్ ముగ్గురు తాండూర్ గ్రామం నుంచి శబరిమలై వరకు కాలినడకన ప్రయాణం చేసి అయ్యప్ప స్వామిని దర్శనం చేసుకున్నట్టు తెలిపారు. అయ్యప్ప స్వాములకు శాలువాతో సన్మానం చేసినట్లు వారికి అయ్యప్ప స్వామిపై ఉన్న భక్తిని ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సిద్దయ్యతో పాటు తాండూర్ సొసైటీ చైర్మన్ గంగారెడ్డి, లక్ష్మీకాంతం, వంశీగౌడ్, మాణిక్యం సెట్ తదితరులు పాల్గొన్నారు.

స్టే ఆర్డర్‌తో నిలిచిపోయిన ఎంపీపీపై అవిశ్వాసం



ప్రజాపరిషత్ కార్యాలయం

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ ఉమ్మడి మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలిపై ఎంపీటీసీల ఫోరం అవిశ్వాసానికి సిద్ధం కాగా ఈ నెల 18న జరగవలసిన అవిశ్వాస తీర్మానం ఎంపీపీ వాగ్మారే లక్ష్మీబాయికి లభించిన స్టే ఆర్డర్‌తో మద్నూర్ ఎంపీపీపై జరగవలసిన అవిశ్వాసం నిలిచిపోయినట్లు మండల అభివృద్ధి అధికారి రవీశ్వర్ గౌడ్ తెలిపారు. మద్నూర్ ప్రజాపరిషత్ అధ్యక్షురాలిపై అవిశ్వాస తీర్మానం కోసం ఈనెల 18 నిర్వహించేందుకు ఉత్తర్వులు జారీకాగా.. ఎంపీపీ అవిశ్వాసానికి వ్యతిరేకంగా కోర్టును ఆశ్రయించి స్టే ఆర్డర్ తీసుకొచ్చారు. తద్వారా అవిశ్వాసానికి అడ్డుకట్ట పడింది. అవిశ్వాస తీర్మానం ఇంతటితో పూర్తిగా ఆగిపోతుందా? లేదా కొనసాగుతుందా? అనే దానిపై ప్రజల్లో ఉత్కంఠ నెలకొంది.

జూనియర్ అసిస్టెంట్ ఆత్మహత్యకు కారణమైన తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి

- కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి
- తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి అబ్రబోయిన స్వామి



మాట్లాడుతున్న తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి అబ్రబోయిన స్వామి

నవతెలంగాణ-దోమకొండ

జూనియర్ అసిస్టెంట్ మార్కంటి శ్రీకాంత్ ఆత్మహత్యకు కారణమైన తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి అబ్రబోయిన స్వామి డిమాండ్ చేశారు. అలాగే ఆ కుటుంబానికి ప్రభుత్వం రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి, కుటుంబంలో ఒకరికి తక్షణమే ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో వీఆర్ఏలను, జూనియర్ అసిస్టెంట్‌ల సర్దుబాటులో ఐడి కార్డును ఇవ్వకపోవడంతో మనోవేదనకు గురైన మృతుడు మార్కంటి శ్రీకాంత్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. గత ప్రభుత్వం ఈ ఉద్యోగులపై చిన్న చూపు చూస్తూ ఆరు నెలలుగా ఐడి కార్డులు ఇవ్వక ఆర్థిక ఇబ్బందుల గురిచేసిందని అన్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఐడి కార్డులు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ బిబిపేట్ తహసీల్దార్ ఐడీ కార్డును ఇవ్వలేదన్నారు. ఐడీ కార్డు లేకపోవడం వల్ల జీతాలు రాక కుటుంబం గడవక ఆర్థిక ఇబ్బందులకు గురైన జూనియర్ అసిస్టెంట్ ఆత్మహత్య చేసుకున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్ ఆత్మహత్యకు కారణమైన తహసిల్దార్ సత్యనారాయణను వెంటనే ప్రభుత్వం సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ నాయకులు మధు, రాములు, రమేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులకు ఆహ్వానం

నవతెలంగాణ-సదాశివనగర్

మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఆరవ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ భానుమతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 22 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

సబ్సిడీపై గడ్డి కోసే యంత్రాలు

నవతెలంగాణ-రామారెడ్డి

సబ్సిడీపై ఎస్సీ, ఎస్టీ పాడి రైతులకు గడ్డి కోసే యంత్రాల కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల పశువైద్యాధికారి రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2హెచ్‌పి, 3 బ్లేడ్లు రూ.8000, 3 హెచ్పి, 3 బ్లేడ్లు రూ.10,000 సబ్సిడీ కలదని, ఆసక్తి గల పాడి రైతులు మండల పశు వైద్య కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని రైతులకు సూచించారు.

రుసుముతో గురుకులాల ప్రవేశానికి దరఖాస్తు

నవతెలంగాణ-రామారెడ్డి

సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి ప్రవేశ దరఖాస్తును ఆన్‌లైన్‌లో రుసుముతో దరఖాస్తు చేసుకోవచ్చని ఉప్పల్వాయి గురుకుల ప్రిన్సిపాల్ ఎం.సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం నాలుగవ తరగతి చదువుతున్న విద్యార్థులు 5వ తరగతి గురుకుల ప్రవేశానికి రూ.100 రుసుముతో ఈనెల 20వ తేదీ వరకు, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఇంటర్మీడియట్‌కు ఈనెల 20వ తేదీ వరకు రూ.200 రుసుముతో ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

నేడు బిచ్కుంద మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-బిచ్కుంద

బిచ్కుంద మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అశోక్ పటేల్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం ఉదయం 11 గంటలకు నిర్వహించడం జరుగుతుందని ఈ సమావేశానికి జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు ముఖ్య అతిథిగా పాల్గొంటారని ఎంపీడీవో ఆనంద్ తెలిపారు. మండలంలోని ఆయా శాఖ అధికారులు తమ శాఖపరమైన పూర్తి నివేదికలతో సరైన సమయానికి హాజరుకావాలని గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు, మండల డివిజన్ స్థాయి అధికారులు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

కార్యాలయానికి పేరు రాయించని అధికారులు

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి కలర్లు వేసి నెలలు గడుస్తున్నప్పటికీ కార్యాలయానికి పేరు రాయించడంలో అధికారులు నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఇదేనా? కాదా?. బిల్డింగు మారిందా అనే విధానంపై ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయానికి పేరు ఉండాలి కానీ నెలలు గడిచినా.. కార్యాలయం పేరు బోర్డుపై రాయించకపోవడం అధికారుల నిర్లక్ష్యమే కారణమని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయానికి కలర్లు వేసి నెలలు గడుస్తున్నా కార్యాలయం పేరు రాయించకపోవడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండల ప్రజాపరిషత్ కార్యాలయం పేరును వెంటనే రాయించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

గ్యాస్ ఏజెన్సీలపై నిఘా

- తహసీల్దార్ భిక్షపతి
- నవతెలంగాణ కథనానికి స్పందన



నవతెలంగాణ-నిజాంసాగర్

గ్యాస్ ఏజెన్సీలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచుతామని తహసీల్దార్ భిక్షపతి తెలిపారు. గ్యాస్ ఏజెన్సీల అక్రమ వసూళ్లపై 'ఈ కేవైసీ పేర వసూళ్లు' అనే శీర్షికన నవతెలంగాణలో గురువారం కథనం ప్రచురితమైంది. దాంతో స్పందించిన తహసీల్దార్ మండలంలోని సుల్తాన్ నగర్ గ్రామంలో గల హెచ్.పి వీరభద్ర గ్యాస్ ఏజెన్సీని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సిహెచ్ అంజయ్యతో కలిసి తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ.. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చూస్తానని, అలాగే గ్యాస్ ఏజెన్సీపై నిఘా ఉంచుతామని ఆయన తెలిపారు. అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన గ్యాస్ నిర్వాహకులకు హెచ్చరించారు. ఇకపై ఎలాంటి వసూళ్లకు గ్యాస్ ఏజెన్సీలు పాల్పడితే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన ప్రజలకు సూచించారు. ఈ-కేవైసీ ప్రక్రియకు ప్రజలు ఎలాంటి డబ్బులు ఇవ్వద్దని ఆయన స్పష్టం చేశారు.

అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం ఆధ్వర్యంలో తీర్మానాలు



మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-ఎడపల్లి

అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం నిజామాబాద్ జిల్లా ఆఫీస్ బేరర్ సమావేశాన్ని కామ్రేడ్ ఎస్.సురేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సహాయ కార్యదర్శి దేవారం ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు రైతుబంధు సంవత్సరానికి రూ.15000 ఎకరానికి చెల్లించాలని, నిజామాబాద్ జిల్లాలో ఉన్న నిజాంషుగర్ చక్కెర కర్మాగారం, శక్కర్‌నగర్ (బోధన్), ఎంసిఎస్ఎఫ్ సారంగాపూర్, మెట్‌పల్లి, మెదక్ ఫ్యాక్టరీలు వెంటనే తెరిపించాలని డిమాండ్ చేశారు. ఏకకాలంలో రెండు లక్షల రూపాయల రుణమాఫీ రైతులకు అమలు చేయాలని డిమాండ్ చేశారు, పంటల బీమాతో పాటు రైతుకు రక్షణ చర్యలు చేపట్టాలనిగుర్తు చేశారు. జిల్లాలో ఎర్రజొన్నలు క్వింటాలకు రూ.4500 చొప్పున, పసుపునకు, క్వింటాకు రూ.15000 చొప్పున ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం రైతులకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకపోవడం వలన ఓటమిపాలైందని కాంగ్రెస్ పార్టీ గుణపాఠంగా స్వీకరించి రైతులకు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తగిన సమయమిచ్చి అమలు చేయని పక్షంలో పెద్దఎత్తున రైతులను రోడ్డుపైకి తీసుకువచ్చే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి గుమ్మల గంగాధర్, బాబన్న, రాజేందర్, యు.రాజన్న, పుట్టి నాగన్న తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శుల సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదు చేపడుతున్న కార్యదర్శులు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని కార్యదర్శులు గురువారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జగన్, ప్రవీణ్, నరేష్, పాపిరెడ్డి, రవీందర్, ప్రశాంత్, సతీష్, స్వాతి, రాధ, స్రవంతి, సౌమ్య, స్వరూప, శ్రీలేఖ, విజయ, దేవిసింగ్, వనజ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వేలంపాట



మాట్లాడుతున్న దేవాదాయ శాఖ అధికారులు

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని జానకంపేట్ గ్రామ శివారులో గల శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షంలో గురువారం వేలం పాట కార్యక్రమాన్ని నిర్వహించారు. త్వరలో రానున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి జాతర బ్రహ్మోత్సవాల్లో భాగంగా వేలంపాట కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. కొబ్బరికాయలు, పూజ సామాగ్రి, నవధాన్యంలో దుకాణాలకు రూ.43వేలు, లడ్డు, పులిహోర దుకాణానికి రూ.39 వేలకు నిజామాబాద్ పట్టణానికి చెందిన సురేష్ అనే వ్యక్తి కైవసం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. సైకిల్ స్టాండ్ ఏర్పాటుకు గానూ రూ.6,800కి తానాకాలన్ గ్రామానికి చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తి దక్కించుకున్నారు. 2024, 2025, రెండు సంవత్సరాల కొరకు కొబ్బరికాయలు, లడ్డు, పులిహోర, నవధాన్యాల దుకాణాల ఏర్పాటు కొరకు నిజామాబాద్‌కు చెందిన రాజు అనే వ్యక్తి రూ.లక్ష 95 వేలకు వేలంపాటలో పాల్గొన్నారు. కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ సుప్రియ, ఆలయ కమిటీ గింజుపల్లి వేణు, జూనియర్ అసిస్టెంట్ రఘు, శ్రీరంగం కొండమాచార్యులు, వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యురాలిని సన్మానించిన ఎంపీపీ



రిషితను సన్మానిస్తున్న ఎంపీపీ

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని మారుమూల గ్రామమైన తాండూర్ గ్రామానికి చెందిన రిషిత బిహెచ్ఎంఎస్ ఆయుర్వేదిక్ వైద్యురాలిగా క్వాలిఫై అయి వైద్యురాలిగా విధులు నిర్వహిస్తున్న సందర్భంగా గురువారం మండల కేంద్రంలో గల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రాజుదాస్ వైద్యురాలు రిషితకు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రాజుదాస్ మాట్లాడుతూ.. పేద కుటుంబంలో పుట్టి బిహెచ్ఎంఎస్‌గా ఎదిగిన రిషితను చూసి చాలా గర్వంగా ఉందన్నారు. మారుమూల గ్రామమైన తాండూరులో పుట్టి పెరిగి బిహెచ్ఎంఎస్ వైద్యురాలిగా నియమించడం అంటే ఆషామాషీ కాదని ఆయన అన్నారు. వైద్యురాలిగా సేవలందించినందుకు చాలా సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వైద్యురాలి తల్లిదండ్రులు వెంకటేశం, శోభ, ఎంపీడీవో రఘు, ఎంపీఓ శ్రీనివాస్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పాలిహౌస్‌ను పరిశీలించిన పి.డి



పాలిహౌస్‌ను పరిశీలిస్తున్న డీఆర్డీవో పీడీ సాయన్న

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని భూంపల్లి శివారులోని మొగ్గం రత్నమాల ఏర్పాటు చేసిన పాలిహౌస్‌ను డీఆర్డీవో పీడీ సాయన్న గురువారం పరిశీలించారు. పాలిహౌస్‌లో వేసే పంటలపై రైతులకు సలహాలు సూచనలు చేశారు. ముఖ్యంగా ఆదాయ అభివృద్ధి కోసం సీసీలందరూ అదనపు ఆదాయం కోసం మహిళలను ప్రోత్సాహించాలని సూచించారు. కూరగాయల పంటలు అధికంగా పండించి ఇతర మండలాలకు ఆదర్శంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం రాజిరెడ్డి, సిసి గొర్రె రాములు తదితరులు పాల్గొన్నారు.

దేవునిపల్లిలో బేటీ బచావో బేటీ పడావో



మాట్లాడుతున్న దృశ్యం

నవతెలంగాణ-కామారెడ్డి

పట్టణంలోని దేవునిపల్లి గ్రామచావిడి అంగన్వాడీ కేంద్రంలో బేటీ బచావో బేటి పడావో కార్యక్రమాన్ని మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ మెంబెర్స్, అంగన్వాడీ బెన్ఫిసిషరీస్ చిల్డ్ ఎడ్యుకేషన్, హెల్త్, విమెన్ ఎంపవర్మెంట్, జెండర్ ఈక్వాలిటీ, పీసీ, పీఎన్‌డీటీ, బాల్యవివాహాలు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, ఫోక్స్ యాక్ట్, డీవీ యాక్ట్, సఖి సర్వీసెస్, మహిళ వైద్య శిబిరం, స్కిల్ డెవలప్‌మెంట్, బిబిబిపి స్కీమ్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళ సాధికారత, కేంద్ర సిబ్బంది శారద, తులసి, సూపర్‌వైజర్ పద్మ అంగన్‌వాడీ టీచర్ పద్మ, మంగ, అనసూయ, ఆర్పీ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

సైలని బాబా దర్గాను సందర్శించిన నారాయణఖేడ్ ఎమ్మెల్యే



నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీలా గ్రామ శివారులోనున్న సైలని బాబా దర్గాను నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి బుధవారం రాత్రి సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో తాను ఈ దర్గాను సందర్శించలేకపోయానని, సైలని బాబా అధినేత వహీద్ బాబా తనకోసం ప్రత్యేక ప్రార్థనలను చేయడం వల్లనే తాను గెలుపొందానని ఆయన పేర్కొన్నారు. సైలని బాబా ఆశీర్వాదం వల్లే తాను ఈరోజు ఎమ్మెల్యేగా గెలుపొందానని, ప్రజలకు మరిన్ని సేవలను అందించే విధంగా ఆశీర్వదించాలని ఆయన పేర్కొన్నారు. సైలని బాబా దర్గాకు చాదర్ పూలమాలలు వేసి ప్రత్యేక ప్రార్థనలను చేశారు. ఆయన వెంట సైలని బాబా నిర్వాహకులు ఆయన అనుచరులు పాల్గొన్నారు.

ఘనంగా నందమూరి తారక రామారావు వర్ధంతి



నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-బోధన్

మాజీ ముఖ్యమంత్రి, నటసార్వభౌముడు నందమూరి తారక రామారావు 28వ వర్ధంతిని గురువారం బోధన్ మండలంలో ఘనంగా నిర్వహించారు. బోధన్ పట్టణ శివారులోని కమ్మ సంఘం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ అభిమానులు మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. అనంతరం కార్యకర్తలకు అన్నదానం చేపట్టారు. అలాగే తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఉమ్మడి మండలంలోని జాడిజమాల్‌పూర్, పెంటాఖుర్దు, ఎరాజ్‌పల్లి గ్రామాలలో ఎన్టీఆర్ విగ్రహానికి టిడిపి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన అభిమానులు మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీని స్థాపించి అతి తక్కువ కాలంలోనే అధికారంలో వచ్చిన ఘనత నందమూరి తారకరామారావుకే చెల్లిందని అన్నారు. ఆయన అమలు చేసిన సంక్షేమ పథకాలు నిరుపేదలకు ఎంతో ఉపయోగపడ్డాయని, ఆయన పాలనను ప్రతి కుటుంబం ఆదరించిందని కొనియాడారు. అలాగే రాజకీయ రంగంలోనే కాకుండా సినిమా రంగంలో కూడా ఆయన ప్రేక్షకులకు ఆకట్టుకుని వారి మనసులో చెరగని స్థానం సంపాదించారని అన్నారు. ఆయన పోషించిన పాత్రలు, ఆయన నటనతో తెలుగు ప్రజలను మంత్రముగ్ధులు చేశారని తెలిపారు. కావున నందమూరి తారక రామారావు తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తూము పద్మ శరత్ రెడ్డి, కౌన్సిలర్ శరత్‌రెడ్డి, కమ్మ సంఘం నాయకులు శివన్నారాయణ, పావులూరి వెంకటేశ్వర్లు, టీడీపీ బోధన్ నియోజకవర్గ ఇన్చార్జ్ కోట గోపాల్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్‌వి హనుమంతరావు, బోధన్ పట్టణ అధ్యక్షులు భాస్కర్, ప్రధాన కార్యదర్శి సాయిబాబా, ఈశ్వర్‌రావు, బోధన్ మండల అధ్యక్షులు కష్టారెడ్డి, సచిన్ పటేల్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్ ఆస్పత్రిలో అమ్మ ఒడి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నవతెలంగాణ-సదాశివనగర్

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం అమ్మ ఒడి నిర్వహించినట్లు డాక్టర్ అస్మా అఫ్రీన్ తెలిపారు. ప్రతి గురువారం నిర్వహించే అమ్మఒడి కార్యక్రమంలో భాగంగా 18 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. రక్తహీనత గర్భవతులకు ఐరన్ సుక్రోష్ అందించినట్లు పేర్కొన్నారు. న్యూట్రీషన్ కిట్ అందించినట్లు పేర్కొన్నారు. ప్రతి మంగళవారం ఆరోగ్య మహిళా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల ప్రకారం కరోనా పట్ల జాగ్రత్తలు పాటించాలని సూచించారు. గుంపులు గుంపులుగా ప్రతి ఒక్కరూ మాస్కులు ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్‌వో నాగరాజు, సిబ్బంది శిరీష, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

మాల్‌తుమ్మెద విత్తన క్షేత్రంలో ముగిసిన వడ్ల వేలం పాట

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని మాల్‌తుమ్మెద విత్తన క్షేత్రంలో గురువారం జిల్లా వ్యవసాయ అధికారిని భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో దొడ్డు రకం వడ్ల వేలంపాట నిర్వహించారు. ఈ సందర్భంగా వేలంపాటలో నలుగురు అభ్యర్థులు ధరావతు చెల్లించి వేలం పాటలో పాల్గొన్నారు. మాల తుమ్మెద గ్రామానికి చెందిన శ్రీనివాస్ వేలంపాటలో పాల్గొని వడ్లు క్వింటాలుకు రూ.2280లకు సొంతం చేసుకున్నారు. 120 క్వింటాళ్ల ధాన్యాన్ని వేలంపాటలో సొంతం చేసుకున్నట్లు ఏడిఏ వీరస్వామి తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎంటిఎస్ఎస్‌డిసి విష్ణువర్ధన్‌రెడ్డి, ఎల్లారెడ్డి ఏడిఏ రత్నం, ఏఓ విజయ శేఖర్, హెచ్ఓ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ అధికారులు

లక్ష్మపూర్ పంచాయతీలో జీపీడీపీపై సభ

నవతెలంగాణ-వర్ని(చందూర్)

మండలంలోని లక్ష్మపూర్ గ్రామంలో సర్పంచ్ సత్యనారాయణ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ అభివృద్ధిపై గ్రామ సభను గురువారం నిర్వ హించారు. ఈ సభలో గ్రామంలోని తాగునీరు, పరిశుభ్రత, హరితహారం, ప్రజలకు స్వచ్ఛ గ్రామంగా ముందుండాలని సభలో తెలిపారు. పై వాటిని మరింతగా ముందుకు తీసుకెళ్తామని గ్రామ సభలో తీర్మానం చేశారు.



గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
శుక్రవారం | జనవరి 19, 2024 | www.navatelangana.com

బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఈ నెల 20న ఉదయం 10గంటలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రెంజల్ ఉమ్మడి జిల్లా స్థాయి జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుల టోర్నమెంట్ కమ్ సెలక్షన్ నిర్వహించనున్నట్టు బాల్ బ్యాడ్మింటన్ సంఘం నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు మానస గణేష్, ప్రధాన కార్యదర్శి శ్యామ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలకు ఉమ్మడి నిజామాబాద్, కామారెడి జిల్లాల క్రీడాకారులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు 02.01.2004 తర్వాత పుట్టిన వారు అర్హులని, ఎంపికైన క్రీడాకారులు వచ్చేనెలలో జరిగే 68వ తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర, బాలికల బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీల్లో పాల్గొనడం జరుగుతుందని తెలిపారు. క్రీడాకారులు ఆధార్ కార్డు తీసుకొని వచ్చి ఆర్గనైజింగ్ సెక్రటరీ కృష్ణమూర్తికి రిపోర్టు చేయాలని పేర్కొన్నారు.

ఎమ్మెల్సీగా నామినేషన్ దాఖలు చేసిన మహేష్ కుమార్‌గౌడ్

నవతెలంగాణ-కంఠేశ్వర్



ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సందర్భంగా గురువారం అసెంబ్లీలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్ నామినేషన్ దాఖలు వేశారు. డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డి, సీనియర్ నాయకులు వి.హనుమంతరావు, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ తదితరులు వెంటరాగా అసెంబ్లీ కార్యదర్శికి మహేష్‌కుమార్‌గౌడ్ ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. మరో సెట్ నామినేషన్‌ను జిల్లాకు చెందిన సీనియర్ శాసనసభ్యులు, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపీ మధుయాష్కిలతో కలిసి రెండో సెట్ నామినేషన్ దాఖలు చేశారు.

18 సంవత్సరాలు నిండితే ఓటరుగా నమోదు చేసుకోవాలి

- తహసిల్దార్ జి.శ్రీకాంత్



నవతెలంగాణ-ఆర్మూర్

18 సంవత్సరాలు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసిల్దార్ జి శ్రీకాంత్ అన్నారు. పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయంలో గురువారం మాట్లాడుతూ ఈనెల 20,,, 21 తేదీలలో అన్ని పోలింగ్ కేంద్రాలలో ఉదయం నుండి సాయంత్రం వరకు బూత్ లెవెల్ అధికారులు అందుబాటులో ఉంటారని, ఓటర్లు స్పెషల్ క్యాంపెనింగ్ డేస్ ని వినియోగించుకోవాలని కోరారు. కొత్తగా ఓటర్లుగా నమోదు చేసుకునే వారికోసం ఫారం నెంబర్ 6, ఓటర్ కార్డులో ఏదైనా తప్పులు దొర్లితే దాన్ని సరిదిద్దుకునేందుకు ఫారం నెంబర్ 8, ఎవరైనా మరణించిన శాశ్వతంగా షిఫ్టు అయిన ఫారం-7 అప్లై చేయించాలని సూచించారు.

ఎమ్మెల్సీ ప్రకటన పట్ల హర్షం

నవతెలంగాణ-భీంగల్

ఎమ్మెల్యేల కోటా కింద ఎమ్మెల్సీగా పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ నియామకం పట్ల ఎన్ఎస్‌యుఐ జిల్లా ఉపాధ్యక్షుడు రెహమాన్ హర్షం వ్యక్తం చేశారు. భీంగల్ మండల ప్రాంతానికి చెందిన బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ కాంగ్రెస్ పార్టీకి అందించిన సేవలను గుర్తించి అధిష్టానం ఎమ్మెల్సీగా ఎమ్మెల్యేల కోటా కింద నియమించిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణకు మారుపేరని పార్టీకి నాయకులు, కార్యకర్తలు అందించిన సేవలను అధిష్టానం ఎప్పుడూ గమనంలో ఉంచుకుంటూ అలాంటి వారికి ఉన్నత పదవులను ఇవ్వడం ఒక కాంగ్రెస్ పార్టీకే చెల్లుతుందని రెహమాన్ తెలిపారు. అలాగే మహేష్ కుమార్ గౌడ్ నియామకం పట్ల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులే హర్షం వ్యక్తం చేశారు

దుకాణాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటుచేసుకోవాలి : ఎస్ఐ

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రంలోని దుకాణ యజమానులకు గురువారం ఎస్ఐ భాస్కరా చారి 'నేను సైతం' అనే కార్యక్రమం చేపట్టి తగు సూచనలను, జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో సమాజ భద్రత దృష్ట్యా ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను నిర్వర్తించాలన్నారు. దుకాణాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాల నిఘా వల్ల నేరాలు అదుపులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో వ్యాపారస్తులు, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చెరువు భూమి కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోండి

- గగ్గుపల్లి వీడీసీ ఆధ్వర్యంలో ఆర్డీవోకు వినతి పత్రం

నవతెలంగాణ-ఆర్మూర్

చెరువు భూమి కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గురువారం నూతన ఆలూరు మండలంలోని గగ్గుపల్లి గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు రెవెన్యూ డివిజనల్ అధికారి వినోద్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొంత కాలం నుండి చెరువును చెరువు పక్కన ఉన్న రైతులు చెరువు భూమిని కబ్జా చేసుకుని అందులో పంట సాగు చేసుకుంటున్నారని, దానివల్ల పశువులకు నీరు తాగడానికి చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. ఈ విషయమై గతంలో చాలాసార్లు ఫిర్యాదు చేసిన అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. చెరువు హద్దులు చూపించాలని ఆర్డీవోను కోరారు. కార్యక్రమంలో గగ్గుపల్లి వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలి

- తహసిల్దార్ శ్రీకాంత్




మాట్లాడుతున్న తహసీల్దార్

నవతెలంగాణ-ఆర్మూర్

రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలని లేనిచో కఠిన చర్యలు తీసుకుంటామని తహసిల్దార్ జి శ్రీకాంత్ అన్నారు. మండలంలోని రేషన్ షాప్ డీలర్ల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండలంలోని రేషన్ కార్డుదారుల ఈకేవైసీ ఇప్పటి వరకు 72శాతం పూర్తయిందని, ఈ నెల 31 లోపల మొత్తం కార్డుల ఈ కేవైసీ పూర్తి చేయాలని అన్నారు. రేషన్ షాప్‌ల వారీగా విజిలెన్స్ కమిటీలు ఏర్పాటుచేసుకొని ప్రతినెలా సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. రేషన్ షాపుల్లో సమయ వేళలు పాటించాలని రేషన్ కార్డులలో ఉన్న మృతి చెందిన సభ్యుల వివరాలు అందజేయాలనీ రేషన్ సరుకుల పంపిణీ సక్రమంగా సరఫర చేయాలని అన్నారు. సమావేశంలో ఉప తహసిల్దార్ విజయ్ కాంత్ రావు, మండల గిర్దావర్ అశోక్ సింగ్, జూనియర్ సహాయకులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరించిన ఎంపీ, ఎమ్మెల్యే



నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

నేషనల్ చైర్మన్ డాక్టర్ కొప్పుల విజయ్ కుమార్ ఆదేశాల మేరకు ఎంపీ అరవింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తాల చేతుల మీదుగా సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నూతన సంవత్సర 2024 క్యాలెండర్‌ను గురువారం ఆవిష్కరించారు. నిజామాబాద్ పట్టణంలో ఎంపీ అరవింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ, నేషనల్ జనరల్ సెక్రెటరీ మామిడాల మనోహర్, సౌత్ ఇండియా చైర్మన్ డాక్టర్ హనుమ గౌడ్ , జిల్లా ప్రెసిడెంట్ దత్తాత్రేగౌడ్ కలిసి క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో బాజిరెడ్డి ప్రశాంత్ , జిల్లా అబ్జర్వేషన్ కమిటీ చైర్మన్ హరీష్ గౌడ్ , ఎల్లమ్మ గుట్ట రమణ గౌడ్, పడకల ప్రసాద్ , నాగరాజు , శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి

- వినియోగదారుల సమస్యలు వెంటనే తీర్చాలి

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

వినియోగదారుల సమస్యలు వెంటనే తీర్చాలని గురువారం నిజామాబాద్ జిల్లా విద్యుత్తు అధికారులతో నెలవారి సమీక్ష సమావేశం కర్నాటి వరుణ్ రెడ్డి-ఐఏఎస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ టిఎస్ ఎన్‌పిడీసిఎల్ వరంగల్ జిల్లా కేంద్రంలోని గోల్డెన్ జూబ్లీ మీటింగ్ హాల్లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని కేటగిరీల విద్యుత్ వినియోగదారులకు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని అన్నారు. విద్యుత్తు లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు తరచుగా మెయింటెనెన్స్ చేయాలని ఆదేశించారు.



మాట్లాడుతున్న అధికారులు

వినియోగదారులతో మర్యాదగా ప్రవర్తిస్తూ వారి సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని, బిల్లులు ఆన్లైన్ ద్వారా చెల్లించే విధంగా అవగాహన కల్పించాలని అన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లకు అవసరమైన ఎర్తింగు, లైటింగ్, ఎబిసిచ్చులు, డిస్ట్రిబ్యూషన్ బాక్సు ఏర్పాటు చేయాలని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఫీల్డ్ సిబ్బందికి రోజువారి పనుల లోకేషన్ ముందుగా తెలియజేసి సంబంధిత ఏలు పనులను ఫీల్డ్‌లో తిరుగుతూ నాణ్యమైన విద్యుత్ వినియోగ దారులకు అందించే విధంగా కృషి చేయాలన్నారు. ట్రాన్స్ ఫార్మర్ల రిపేర్‌లో సిబ్బందికి ట్రైనింగ్ ఇవ్వాలని సూచించారు. నాణ్యత పెంచాలని అన్నారు. కొత్త గా దరఖాస్తు చేసుకున్న వ్యవసాయ వినియోగదారులకు తొందరగా సర్వీసు రిలీజ్ చేయాలని సూచించారు. రోజువారి పని విధానంలో పూర్ ఫెర్ఫార్మన్స్ ఉన్న అధికారులను ఇకపై మెరుగైన పని విధానంతో పని చేయాలని సూచించారు. సమావేశంలొ ఆర్ రవీందర్- ఎస్సీ, డీలు ఎస్సేఓఏడీలు సీఎంను పూల మొక్కలతో సత్కరించారు. సమావేశంలో మోహన్ రెడ్డి డైరెక్టర్, సంధ్యారాణి డైరెక్టర్-కమర్షియల్, తిరుపతిరెడ్డి డైరెక్టర్ ఫైనాన్స్, అనిల్ కుమార్ డీఈ టెక్నికల్ టు సీఎండీ , జిల్లాలోని డిఈలు, ఏడీఈలు, ఏఏఓలు, ఏఈలు పాల్గొన్నారు.

వరంగల్ చైర్మన్ కె.వరుణ్‌కు స్వాగతం

కే.వరుణ్ రెడ్డి ఐఏఎస్ చైర్మన్, ఎండీ టిఎస్ఎన్పిడిసిఎల్ వరంగల్ నిజామాబాద్ జిల్లా కు రివ్యూ మీటింగ్‌కు మొదటి సారి రావడంతో జిల్లా ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ జేఏసీ నాయకులు స్వాగతం పలికి పూల మొక్క ను అందజేశారు. జేఏసీ చైర్మన్ లక్ష్మారెడ్డి, కో కన్వీనర్ తోట రాజశేఖర్, 1104 కంపనీ అధ్యకులు రఘునందన్, శివాజీ గణేష్, బాలేష్ కుమార్, జి.శ్రీనివాస్, కాశీనాథ్, సురేష్ కుమార్, గంగారాం నాయక్, ఎం.అశోక్, రాజేందర్, ఆర్ చంద్రశేఖర్ ,రాజేందర్, శ్రీనివాస్, శ్యాం, జాకీర్ అలి, నాగరాజ్, రమణ, హరిక్రిష్ణ, శివ కుమార్, రవి కిశోర్, జ్ఞానేష్, ప్రసాద్, నగేష్, రాకేశ్ పాల్గొన్నారు.

హిందుత్వ ప్రచారాన్ని అడ్డుకోవాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

హిందుత్వ ప్రచారాన్ని అడ్డుకోవాలని, బిజెపిని ఓడించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు కామ్రేడ్ పశ్య పద్మ అన్నారు. సిపిఐ నిజామాబాద్ పార్లమెంటరీ సమావేశం స్థానిక రైస్ మిల్ ఫిట్టర్ ఏఐటియుసి కార్యాలయంలో పి.సుధాకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ముందుగా నిజామాబాద్ జిల్లా సిపిఐ, ఏఐటీయూసీ మాజీ నాయకులు గడ్డం వెంకట్ రెడ్డి 3వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. నిజామాబాద్ పార్టీ, ప్రజాసంఘాల నిర్మాణంలో అమరులు గడ్డం వెంకట్ రెడ్డి సేవలు మరువలేనివని అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని తెలిపారు. దేశంలో అబద్ధపు ప్రచారాలతో శ్రీరాముడి పేరుతో హిందూ మతాన్ని రాజకీయంగా వాడుకోవటానికి హిందుత్వ ప్రచారాన్ని విస్తృతంగా కొనసాగిస్తూ దేశ ప్రజల మధ్య ఐక్యతను దెబ్బ కొట్టడానికి లౌకిక వాదాన్ని నిర్వీర్యం చేయడానికి బిజెపి, ఆర్ఎస్ఎస్ కొనసాగిస్తున్న ప్రయత్నాన్ని అడ్డుకోవటానికి కృతనిశ్చయంతో ప్రజలతో మమేకమై బిజెపి అసలు నైజంని ఎండ కట్టడానికి సమాయత్తం కావాలని



మాట్లాడుతున్న పశ్య పద్మ

పిలుపునిచ్చారు. నిజామాబాద్ జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని లిఖితపూర్వకంగా రాసి ఇచ్చిన పసుపు బోర్డు ఏర్పాటు చేయలేదని అన్నారు. ప్రధానమంత్రి అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా హడావుడిగా ప్రకటనలు గుప్పించాడని, నేటికీ ఆ బోర్డు ఏర్పాటుకు చర్యలు లేవని తెలిపారు. ఆసియాలోని అతిపెద్ద బోధన్ షుగర్ ఫ్యాక్టరీ మూతపడి కార్మికులు, రైతులు వీధిన పడ్డ ఏమాత్రం స్పందించని బిజెపి కేంద్ర పాలకులు ఎన్నికల్లో గెలవడానికి హిందుత్వ, హిందూ మతాన్ని రాజకీయంగా వాడుకోవటానికి ప్రయత్నాలు కొనసాగిస్తున్నారని విమర్శించారు. దేశంలో 24 కోట్ల 86 లక్షల మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని, నీతి అయోగ్ ద్వారా చెప్పించడం.. ధనిక దేశంగా మారిందని ప్రచారం చేయటం.. వారు చేస్తున్న అబద్ధ ప్రచారాలకి ప్రతీకఅని అన్నారు. ప్రజల నమ్మకాలను ఓటు బ్యాంకుగా మార్చుకోవటంలో భాగమే శ్రీరాముడికి అక్షింతల పేరుతో గ్రామ గ్రామాలలో వాటిని సేకరిస్తున్నారని తెలిపారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించకుండా.. ఉపాధి ఉద్యోగ కల్పన చేయడానికి నిర్దిష్టమైన ప్రయత్నాలు కొనసాగించకుండా ప్రజలను బాధలను నుండి పక్క దారి మళ్లించటానికి ఉద్దేశపూర్వకంగా కేంద్ర పాలకులు చేస్తున్న కుట్రపూరితమైన ప్రయత్నాలను తిప్పి కొట్టాలని నిజామాబాద్, జగిత్యాల జిల్లాలకు చెందిన సిపిఐ శాఖ కార్యదర్శిలను పశ్య పద్మ కోరారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర నాయకులు కంజర భూమయ్య, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర నాయకులు గడ్డం మురళీధర్ రెడ్డి, సిపిఐ నిజామాబాద్ జిల్లా నాయకులు వైఓమయ్య, కే రాజన్న, ఏ రాజేశ్వర్, ఆరేపల్లి సాయిలు, వై రాజిరెడ్డి, స్వరూప రాణి, రాందాస్ జగిత్యాల సిపిఐ జిల్లా నాయకులు, సిహెచ్ విశ్వేశ్వర్ మహేష్ మరియు నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సిపిఐ శాఖ కార్యదర్శి పాల్గొన్నారు.

బేటి బచావో.. బేటి పడావోపై శిక్షణ



నవతెలంగాణ-మోపాల్

మండలకేంద్రంలోని రైతు వేదికలో గురువారం ఆడపిల్లల సంరక్షణకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భేటీ బచావో బేటి పడావో కార్యక్రమంపై అంగన్వాడీ టీచర్లకు, ఆశ వర్కర్లకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మహిళా శంకు సంక్షేమ అధికారి రసూల్ బి, సిడిపిఓ సౌందర్య తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా సిడిపిఓ సౌందర్య మాట్లాడుతూ ఆడపిల్లల సంరక్షణ, భ్రూణ హత్యలు, మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలను అరికట్టడం తదితర వాటిపై వివరించారు. యుక్త వయసులో ఉన్న ఆడపిల్లలు సమస్యలను ఎలా ఎదుర్కోవాలని, మనోధైర్యం గురించి వారికి వివరించాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో సూపర్వైజర్ జాకీరా, మహిళా సాధికారిక కేంద్ర జిల్లా కోఆర్డినేటర్ స్వప్న, సౌమ్య, పుష్ప, టిహెచ్ వెంకటేశ్వర్లు, మెడికల్ ఆఫీసర్ శ్యాంసుందరి, తదితరులు పాల్గొన్నారు.

'గడుగ్గాయ్' పిల్లల పత్రికలో విజయ్ విద్యార్థుల రచనలు



గెలుపొందిన విద్యార్థులతో అమృతలత

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

గడుగ్గాయ్ పిల్లల మాసపత్రిక 2024, సంక్రాంతి పండగ సందర్భంగా విద్యార్థులకు కవితలు, కథలు, వ్యాసాల పోటీలు ఈ మెయిల్ ద్వారా సేకరించారు. అంతర్జాతీయ స్థాయిలో సేకరించిన ఈ ప్రక్రియలలో కందూరు చంద్రయ్య స్మారకార్థం నిర్వహించిన ఈ పోటీలలో వ్యాసవిభాగంలో ఎనిమిదవ తరగతి చదివే ఉమైజా అఫీన్కు ద్వితీయ బహుమతిగా రూ.1000 నగదు గెలుపొందారు. కవితా విభాగంలో తొమ్మిదవ తరగతి చదివే బి.అనన్యకు రూ.750 నగదు, ఓ.వేదప్రియ, ఎం.తన్వి, ఎం.రిశ్విత్, పి.ప్రేరణ, ఆర్.శ్లోక, రౌదాజహాన్, ఎస్. అక్షయరెడ్డి, బి.శ్రీహితలకు రూ.100 నగదు అందజేశారు. కథల విభాగంలో సి.హెచ్.వెంకట హన్సిత్, ఆర్.శ్లోక, ఎం.సాహితి, సి.ప్రేక్షలకు రూ.200 నగదు బహుమతులు లభించాయని నిర్వాహకులు వాట్సాప్ ద్వారా సమాచారాన్ని అందించారు. ఈ సందర్భంగా విజయ్ హైస్కూల్ వ్యవస్థాపకులు డా.అమృతలత విద్యార్థులను అభినందించారు.

సుపరిపాలన విధానంపై శిక్షణ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారి

నిజామాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్‌లో సీటీఐ రాజేంద్రనగర్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో గురువారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సుపరిపాలన విధానంపై శిక్షణ కార్యక్రమం, సంఘ అధ్యక్షులు, పాలకవర్గ సభ్యులకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణ అధికారి నాగభూషణం వందే, నాబార్డ్ డీడీఎం ప్రవీణ్ కుమార్, ఎం.యాదగిరి జీఎం, సూర్య ప్రకాష్-జీఎం, సీటీఐ ఫ్యాకల్టీ మెంబర్స్ విజయ్ శంకర్, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

విప్లవకారుల ఐక్యతతోనే ప్రజాస్వామిక విప్లవం సాధ్యం

- సీపీఐ(ఎంఎల్)ప్రజాపంథా

నవతెలంగాణ-సిరికొండ

విప్లవకారుల ఐక్యతతోనే నూతన ప్రజాస్వామిక విప్లవం సాధ్యం అవుతుందని, విప్లవ పార్టీల ఏకికరనేతోనే శ్రమజీవుల రాజ్యం సాధించగలుగుతామని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా ఆర్మూర్ డివిజన్ సహాయ కార్య దర్శి రమేష్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని కొండాపూర్ గ్రామంలో సీసీసీఐపీ(ఎంఎల్), సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, సీపీఐ(ఎంఎల్) రెవల్యూషనరీ ఇన్సియేటివ్ విప్లవపార్టీలు మార్చ్ 3,4,5 తేదీల్లో ఖమ్మంలో విలీనం మహాసభలు నిర్వహిస్తున్న సందర్భంగా గ్రామంలో పార్టీ శ్రేణులు ఇంటింటి ప్రచారం విస్తృతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేడు ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయని , సామ్రాజ్యవాదులకు దేశాన్ని తాకట్టు పెట్టారని అన్నారు. మోడీ తన పాలనలో ప్రజలకు ఏమి ఒరగబెట్టింది ఏమి లేదని, అందుకే మతంను అడ్డు పెట్టుకొని రాముడి పేరుతో అధికారంలోకి రావాలని



మాట్లాడుతున్న నాయకులు

ఎత్తుగడ వేశారని అన్నారు. దేశభక్తి పేరట ఆదాని, అంబానీలకు ప్రభుత్వ రంగం సంస్థలను చౌకగా అమ్మేస్తున్నాడని అన్నారు. విప్లవ పార్టీల విలీనం మహాసభలను విజవంతం చేయాలని ప్రజలకు పిలుపును ఇచ్చారు. కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా అధ్యక్షులు అనీస్, పార్టీ డివిజన్, మండల నాయకులు దామోదర్, కిశోర్, సాయరెడ్డి, రమేష్, నారగౌడ్ మల్కి. లింబాద్రి, సంతోష్, మహేందర్, సర్పంచ్, నిమ్మ. రాములు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ పోటీల్లో తడపాకల్ విద్యార్థులకు బహుమతులు



నవతెలంగాణ-ఏర్గట్ల

సాహిత్య రంగంలో తడపాకల్ విద్యార్థులు మరో ఘనత చాటారు. కెనడా దేశపు అంతర్జాతీయ మాసపత్రిక "గడుగ్గాయి"సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన కథలు,కవితల పోటీల్లో దేగల వైష్ణవి రాసిన "బంగారు బాల్యం"కవితకు మొదటి బహుమతి, వైష్ణవి, శ్రీలేఖ, షేక్ కుల్సన్, గంగోత్రి, రక్షిత రాసిన కవితలకు ద్వితీయ బహుమతులు లభించినట్లు తెలుగు పండితులు ప్రవీణ్ శర్మ తెలిపారు.వీరికి నగదు బహుమతి, ప్రశంస పత్రాలను అందజేస్తారని అన్నారు.బహుమతులు గెలుపొందిన విద్యార్థులకు పాఠశాల తరపున శాలువా, పుస్తకాలను ప్రధానోపాధ్యా యులు అబ్దుల్ జావీద్ అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధాకర్, రాములు, గంగాధర్, స్వప్న, సుజాత, విజయ పాల్గొన్నారు.

హ్యుందాయ్ కొత్త క్రెటా ఆవిష్కరణ



నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

హ్యుందాయ్ మోటార్ ఇండియా తాజాగా కొత్త క్రెటా కారుని విడుదల చేసింది. మండలంలో అర్గుల్ గ్రామ శివారులోగల ప్రకాష్ హ్యుందాయ్ షోరూంలో ఎండీ నల్ల దినేష్ రెడ్డి, ఆర్మూర్ ఎస్‌బిఐ మేనేజర్స్ హర్ష (మెయిన్ బ్రాంచ్), సాయి (ఆర్ఆర్ నగర్) ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 2024 హ్యుందాయ్ క్రెటా కారును విడుదల చేశారు . ఎండీ మాట్లాడుతూ ఎందరో కస్టమర్ల మన్ననలు పొందిన క్రెటా కారును సరికొత్తగా అత్యాధునిక టెక్నాలజీని పొందుపరుస్తూ కస్టమర్ల అభిరుచులకు తగట్టు గా ఈ నూతన క్రెటా కారుని తీసుకరావటం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ డైనమిక్ %బాఖఎ% క్వాడ్ బీమ్ %బాజుణ% హెడ్‌ల్యాంప్‌లు, హ్యుందాయ్ స్మార్ట్‌సెన్స్ లెవల్ 2 ూణాూా వంటి ఫీచర్లను కలిగి ఉన్న 'సెన్సుయస్ స్పోర్టినెస్' డిజైన్ లాంగ్వేజ్‌ను కలిగి ఉందన్నారు. ఇది కొత్త 1.5%బా% టర్బో %+ఊఱ% పెట్రోల్ ఇంజన్‌తో సహా శక్తివంతమైన పవర్‌ట్రెయిన్‌ల ఎంపికను ధర రూ 10.99-19.99 లక్షలు (ఎక్స్‌షోరూమ్) అందిస్తుంది.భారతదేశంలో హ్యుందాయ్ యొక్క %బాఖఎ% లైనప్‌కు కొత్త శకం ప్రారంభమైంది. కొత్త %జక్మజరూా%తో మీ డ్రైవ్‌లో విప్లవాత్మక మార్పులు చేయడానికి సిద్ధంగా ఉండండిఅని తెలిపారు. కార్యక్రమంలో షోరూం మేనేజర్ బొజేందర్, సర్వీస్ మేనేజర్ సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్ జట్లకు బహుమతుల ప్రదానం

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని మంచిప్ప గ్రామంలో గురువారం జై భారత్ యూత్ అధ్యక్షులు నాయుడు సాయిరాం ఆధ్వర్యంలో జరిగిన వాలీబాల్ టోర్నమెంట్ గెలుపొందిన జట్లకు బహుమతుల ప్రధానోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ ఛాతి వైద్యనిపుణులు అయిన డాక్టర్ బల్వీర్ సింగ్ మాట్లాడుతూ కొన్ని కొన్ని విషయాలను పదే పదే ఆలోచించడం వల్ల అధిక ఒత్తిడికి గురై లేనిపోని ఆలోచనలు వచ్చే అవకాశాలుంటాయి. వరుసగా పనులు చేస్తుంటే ఒత్తిడికి గురవుతుంటారు. మధ్య మధ్యలో కాస్త విరామం తీసుకుంటూ ఉండాలి. ఎక్కువగా ఇబ్బంది పెట్టే విషయాలను సైతం చూడడం, వినడం కాని చేయవద్దు. ప్రతి చిన్న విషయాన్ని ఎక్కువగా ఆలోచించడం వల్ల కూడా మానసికంగా బాగా కుంగిపోతారన్నారు. దీంతో అనారోగ్య సమస్యలు దరి చేరుతాయి. ఇలా అధిక ఒత్తిడి పెరిగిపోవడం వల్ల ఆరోగ్యం బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

ప్రతిరోజూ ఉదయం యోగా లేక వ్యాయామం చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. ఒత్తిడి తగ్గాలి



వాలీబాల్ టోర్నమెంట్‌లో గెలుపొందిన జట్టుకు బహుతులు అందజేత

అంటే వ్యాయామం, వాకింగ్, రన్నింగ్ తప్పక చెయ్యాలన్నారు. కనీసం రోజుకు 45 నిమిషాల పాటు ఈ వ్యాయామలు చెయ్యడం వల్ల ఒత్తిడి తగ్గి మనసు ప్రశాంతంగా ఉండడానికి సహాయ పడుతుందన్నారు. కంటి నిండా నిద్ర ఉంటే ఆ వ్యక్తులకు ఒత్తిడిని సులువుగా జయయిస్తారన్నారు. రాత్రిపూట త్వరగా నిద్రపోయి ఉదయం త్వరగా లేస్తే మానసిక ప్రశాంతత దొరుకుతుందన్నారు. ఇనుప కండరాలు.. ఉక్కు నరాలు.. వజ్ర సంకల్పం ఉన్న యువత ఈ దేశానికి అవసరం' అన్న స్వామి వివేకానంద మాటలను వారు స్ఫూర్తిగా తీసుకొని జీవితంలో ఉన్నత ఆశయం కోసం పని చేయాలన్నారు. 20 సంవత్సరాల నుండి వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్న జై భారత్ యువజన సంఘానికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ జగదీష్ యాదవ్, మాజీ ఎంపీటీసీ వెంకట్రాంనాయక్, యూత్ అధ్యక్షులు నాయుడు సాయిరాం వీడీసీ అధ్యక్షులు గోపూర్ నరేష్ రెడ్డి, పిటి దేవేందర్, దర్పస్తు నవీన్, గంగాప్రసాద్, గౌతమ్ , శ్రీకాంత్, వాలీబాల్ క్రీడాకారులు, గ్రామ యువకులు పాల్గొన్నారు.

వెబ్ చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భల స్టూడియోస్ నిర్మాణంలో ఆదిలాబాద్ జిల్లాకు చెందిన దర్శకుడు సాయిచరణ్ మేంగని రచన దర్శకత్వం వహించిన మజ్నూ(ద లవ్ లాస్టింగ్ పెయిన్) అనే వెబ్ చిత్రం చిత్రీకరించారు. దీనికి సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ గురువారం ఆయన నివాసంలో విడుదల చేశారు. ఇందులో నటీనటులుగా అనిరుద్, అంబిక, ప్రశాంత్, వినిత తదితరులు నటించారు. ఈ చిత్రానికి కెమెరామెన్ చిన్నా భూపాల, సంగీతం ప్రశాంత్, మార్క్ ఎడిటింగ్ చలపతి దిలీప్ పని చేశారు. ఆదిలాబాద్‌లో కళాలు, కళాకారులకు కొదవ లేదని త్వరలో ఆదిలాబాద్ పరిసర ప్రాంతంలో సినిమా చేస్తానని దర్శకుడు సాయిచరణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంచనవల్లి రత్నాకర్, రమేష్, కిషన్ గౌడ్, కబీర్ దాస్, జానపద కళాకారుడు మేంగని నర్సయ్య పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
శుక్రవారం | జనవరి 19, 2024 | www.navatelangana.com

ప్రజా సేవకు కృషిచేసిన మహిపాల్ రెడ్డి చిరస్మరణీయులు

పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్

నవతెలంగాణ-ఆర్మూర్



ప్రజా సేవకు ఎనలేని కృషి చేసిన నాయకులు మాజీ మంత్రి మహిపాల్ రెడ్డి చిరస్మరణీయులు అని జిల్లా పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ అన్నారు. గురువారం పట్టణంలోని మామిడిపల్లి చౌరస్తా వద్ద ఆయన వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మహిపాల్‌రెడ్డి సతీమణి మాజీ ఎమ్మెల్యే అన్నపూర్ణమ్మ, నాయకులు ఏలేటి మల్లికార్జున రెడ్డి, యామాద్రి భాస్కర్, ఆకుల రాజు, జెస్సు అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పని చేసే వాళ్లకు ఓటు వేయాలి

ఎంపీ ధర్మపురి అరవింద్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

పని చేసే వాళ్లకు ఓటు వేయాలని, మోడీ కేంద్రంలో ఉంటే సబ్కా సాత్ సబ్కా వికాస్ ఉంటుందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. ఈనెల 22న అయోధ్యలో బాలరాముని ప్రాణప్రతిష్ట చేయనున్న సందర్భాన్ని పురస్కరించుకొని గురువారం నిజామాబాద్ జిల్లా బీజేపీ పార్టీ కార్యాలయంలో చిట్ చాట్ నిర్వహించారు. ఈసదర్భంగా ఆయన మాట్లాడుతూ.. 61 సంవత్సరాలు పాలించిన కాంగ్రెస్ పార్టీ అయోధ్యలో హాస్పిటల్, కాలేజీలు కట్టాలని శ్రీరాముని ఆలయానికి వ్యతిరేకంగా ప్రచారం చేశారని, సెక్యులర్ పార్టీలు బాబ్రీ మసీదుకు కేటాయించిన 5 ఎకరాలలో హాస్పిటల్లో కాలేజీలు కట్టాలని ఎందుకు అనడం లేదని ఎద్దేవా చేశారు. అయోధ్యలో ప్రాణ ప్రతిష్టకు వచ్చి తీర్థ ప్రసాదాలు తీసుకోమని ఆహ్వానిస్తే, బిజెపి రాముని మందిరంతో రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించడం సరికాదన్నారు. అక్బర్ రాజపుత్‌ల ఇంట్లో పుట్టి పెరగడం వల్ల, హిందువుల మధ్య జీవనం గడపడం వలన మంచి కార్యక్రమాలు చేశారన్నారు. శ్రీకృష్ణ జన్మ స్థలంలో శ్రీకృష్ణుని దర్శించుకోవడానికి పోనివ్వకుండా ఆంక్షలు విధిస్తున్నారని, అది మందిరంపై ఉన్న మసీదులో ప్రార్థనలు ఎందుకు చేస్తున్నారని దాన్ని ఎందుకు అడ్డుకోవడం లేదని అన్నారు. భక్తులను చూడనీయకుండా చేసి శ్రీకృష్ణుని జైల్లో వేసినట్లు చేశారన్నారు. పార్లమెంట్ ఎలక్షన్ లో అందరూ బిజెపికి వైపే మొగ్గు చూపుతున్నారని అన్నారు. నిజామాబాద్‌లో మాధవ నగర్ వద్ద రైల్వే బ్రిడ్జి పనులు చురుకుగా కొనసాగుతున్నాయని, దాదాపు పూర్తి కావస్తున్నాయని తెలిపారు. అక్కడ ఆర్మూర్ రోడ్‌లోని మామిడిపల్లి వద్ద రైల్వే బ్రిడ్జి పనులలో కేంద్రం నుంచి 20 కోట్లు నిధులు రాగా అందులో నుంచి 14 కోట్లు గత బీఆర్ఎస్ ప్రభుత్వం దారి మళ్లించిందన్నారు. పనులు అక్కడ నత్త నడకన సాగడానికి కారణం అన్నారు. నిజామాబాద్‌లో అర్సపల్లి వద్ద ఈ నెల 25న ఫ్లైఓవర్ కోసం శంకుస్థాపన చేయనున్నామని, బోధన్ నియోజకవర్గంలో రెండు ఫ్లైఓవర్లను త్వరలోనే శంకుస్థాపన చేస్తామని అన్నారు. రానున్న కాలంలో బీఆర్ఎస్ పార్టీ కనుమరుగవుతుందని జోష్యం చెప్పారు. కేటీఆర్ మాత్రం సర్పంచులకు నిధులపై మాట్లాడుతున్నారని పదేళ్లుగా సర్పంచులు ఆత్మహత్యలకు పాల్పడిన, ఆస్తులు అమ్ముకున్న అప్పుడు స్పందించకపోవడం ఏందని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి నన్ను వెంటాడి ఓడిస్తానన్న కల్వకుంట్ల కవిత ఇక్కడ పోటీ చేయరా.. అని చమత్కరించారు. అర్బన్, ఆర్మూర్‌లో ఇకపై నయాపైసా కరప్షన్ ఉండదని హామీ ఇచ్చారు. పార్టీలకతీతంగా మోడీకి ఓటు వేస్తారని చెబుతున్నారని, అక్కడ మోడీ ఇక్కడ ఏడి అని నిజామాబాద్ పార్లమెంటరీ ప్రజలు అంటున్నారని అన్నారు. పని చేసే వాళ్లకు ఓటు వేయాలని అన్నారు. మోడీ కేంద్రంలో ఉంటే సబ్కా సాత్ సబ్కా వికాస్ ఉంటుందని అన్నారు. అన్ని సామాజిక వర్గాల ప్రజల అభ్యున్నతి ధ్యేయంగా ఓడి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ, బీజేపీ డిచ్పల్లి నియోజకవర్గం ఇంచార్జి కులచారి దినేష్, బిజెపి ఫ్లోర్ లీడర్ స్రవంతి రెడ్డి, కార్పొరేటర్ ప్రవళిక శ్రీధర్, శ్రీధర్, న్యాలం రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ అరవింద్

విద్యానగర్ కాలనీ కమిటీ ఏర్పాటు

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని విద్యానగర్ కాలనీ నూతన కమిటీని గురువారం సభ్యుల సమక్షంలో ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా యామాద్రి భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా పృథ్వీరాజ్ గౌడ్, ఉపాధ్యక్షులుగా రాము, భూమేశ్వర్, కోశాధికారిగా శ్రీనివాస్ తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి నిర్విరామ కృషి చేస్తానని తెలిపారు.

నిజాన్ని నిర్భయంగా రాస్తున్న పత్రిక నవతెలంగాణ

రెవెన్యూ డివిజనల్ అధికారి వినోద్ కుమార్



నవతెలంగాణ-ఆర్మూర్

ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా, ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుపుతూ నవతెలంగాణ ముందుంటుందని రెవెన్యూ డివిజనల్ అధికారి వినోద్ కుమార్ అన్నారు. పట్టణ ఆర్డీవో కార్యాలయంలో నవతెలంగాణ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. కార్మికులు, రైతులు, బడుగు బలహీన వర్గాల వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుపుతూ నిజాన్ని నిర్భయంగా రాస్తున్న పత్రిక నవ తెలంగాణ అని అన్నారు. కార్యక్రమంలో డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎల్ ప్రవీణ్ కుమార్ డివిజన్ ఇంచార్జ్ కే.గోపి, స్థానిక విలేకరి సొక్కాల తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని అంకాపూర్ గ్రామంలో సంక్రాంతి పండగ సందర్భంగా సర్కిల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా గురువారం నియోజకవర్గ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై గెలుపొందిన రెడ్డీస్ యూత్ రన్నరప్‌గా నిలిచిన డింగన్స్ యూత్ అభ్యర్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..సొంత గ్రామంలో ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఎమ్మెల్యేను అంకాపూర్ ఆర్గనైజర్స్ తరఫున సన్మానించారు.

న్యాయం కోసం మృతదేహంతో రాస్తారోకో

నవతెలంగాణ- నవీపేట్



దాంగే సాయిలు (ఫైల్)

మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులు, గ్రామస్తులు రాస్తారోకో చేసిన ఘటన నవీపేట్ మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో గల సంజీవరెడ్డి హోటల్ వద్ద గురువారం ఉదయం 8 గంటలకే స్థానిక దర్యాపూర్ కు చెందిన డాంగే సాయిలు (58) మృతి చెందాడు. హోటల్ యజమాని సంజీవరెడ్డి కొందరు కలిసి హోటల్ వైపు ఉన్న మృతదేహాన్ని గాంధీ విగ్రహం వైపు తీసుకొచ్చారు. కాగా బంధువులకు సమాచారం అందడంతో సాయిలు మృతికి హోటల్ యజమాని, సిబ్బంది కారణమని ఆరోపిస్తూ ఆందోళన చేశారు. సమాచారం మేరకు ఎస్సై యాదగిరి గౌడ్ సంఘటన స్థలాన్ని పరిశీలించి అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కొరకు జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. కాగా బంధువులు గ్రామస్తులు మృతదేహాన్ని రోడ్డుపై ఉంచి సుమారు రెండు గంటలకు పైగా రాస్తారోకో నిర్వహించారు. మృతికి కారణమైన హోటల్ యజమానిని పిలిపించి తమకు న్యాయం చేయాలని పోలీసులు సైతం యజమానికి కొమ్ముకాస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సౌత్ రూరల్ సీఐ వెంకటనారాయణ సంఘటన స్థలానికి చేరుకొని సముదాయించే ప్రయత్నం చేసిన రాస్తారోకో విరమించకపోవడంతో కిలోమీటర్ మేర వాహనాలు నిలిచిపోయాయి. సీఐ వెంకటనారాయణ బాధితులు, మీడియాతో మాట్లాడుతూ.. పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా విచారించి చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో విరమించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.



రాస్తారోకో చేస్తున్న మృతుని కుటుంబీకులు

35 ఏళ్ళ నిరీక్షణకు ప్రతి ఫలం

హర్షం వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు



మహేష్‌కుమార్ గౌడ్‌కు బొకే అందిస్తున్న మండల నాయకులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

35ఏళ్ళుగా కాంగ్రెస్ పార్టీ విదేయుడిగా ఉంటు పలు పదవుల్లో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తునే అందరి వారిగా కాంగ్రెస్ అదిష్టానం మెప్పు పొంది ప్రస్తుతం టి పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉండి అధికారంలోకి రావడానికి శాయశక్తులా కృషి చేయడంతో అధిష్టానం మహేష్ కుమార్ గౌడ్‌కు ఎమ్మెల్సీగా ప్రకటించడం అభినందనీయమని డిచ్‌పల్లి, ఇందల్ వాయి మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అమృత పూర్ గంగాధర్, మోత్కురి నవీన్ గౌడ్, పిసిసి డెలిగేట్ శేఖర్ గౌడ్ అన్నారు. గురువారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ గా నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులతో కలిసి శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు నవతెలంగాణ తో మాట్లాడుతూ పార్టీ కష్టంలో ఉన్నప్పుడు కార్యకర్తలను నాయకులను ఏకతాటిపైకి తీసుకుని వచ్చి అధిష్టానం మెప్పు పదడంవల్లనే 35 నిరీక్షణకు ప్రతిఫలం దక్కిందన్నారు. ఎమ్మెల్సీగా ఉంటూ జిల్లా అభివృద్ధికి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోవు రోజుల్లో మరిన్ని పదవులు అధిరోహించాలని వారు అన్నారు. కలిసిన వారిలో సినియర్ నాయకులు, మండల మాజీ కో ఆప్షన్ సభ్యులు శ్యాంసన్, డిసిసి డెలిగేట్ వాసు బాబు, ధర్మ గౌడ్, దయాకర్ గౌడ్ ఉన్నారు.

నేడు పలు బ్రిడ్జిలకు శంకుస్థాపనలు

హాజరు కానున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని డిచ్‌పల్లి, ఇందల్‌వాయి మండలాల్లో పలు బ్రిడ్జి లకు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి శంకుస్థాపనలు చేయనున్నట్లు డిచ్ పల్లి, ఇందల్ వాయి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అమృత పూర్ గంగాధర్, మోత్కురి నవీన్ గౌడ్ గురువారం తెలిపారు. శుక్రవారం నడిపల్లి గ్రామంలో నిజామాబాద్ హైదరాబాద్ అర్అండ్‌బి రహదారిపై జి ఫంక్షన్ హాల్ వద్ద హెచ్‌ఎల్‌బి వంతెనకు శంఖుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. అనంతరం ఇందల్ వాయి మండలంలోని వెంగల్పాడ్ గ్రామ సమీపాన ఇందల్ వాయి -ధర్పల్లి అర్అండ్‌బి రహదారి మొరగు వాగుపై హెచ్ ఎల్‌బి వంతెనకు శంఖుస్థాపన, ఎల్లారెడ్డిపల్లి, లింగాపూర్ వాగుపై హెచ్ ఎల్‌బి వంతెనకు శంఖుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. పార్టీ నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

రెండోసారి శంకుస్థాపన చేయడం దేనికి

ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్

గత బీఅర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ కోట్ల రూపాయలు మంజూరు చేయించి ఎన్నికల కంటే ముందే బ్రిడ్జి లకు శంకుస్థాపనలు చేశారని, టెండర్లు సైతం పూర్తయ్యాయని, ఆ పనులు ప్రారంభించకుండా మరోసారి శంకుస్థాపన చేయడం దేనికని ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్ ప్రశ్నించారు. ఎన్నో ఆశలతో రూరల్ ప్రజలు భారీ మెజార్టీ ఇచ్చి గెలిపించాలని గతంలో ఎమ్మెల్యేగా ఉన్న బాజిరెడ్డి గోవర్ధన్ కోట్ల రూపాయలు ప్రభుత్వం నుండి తీసుకుని వచ్చి అభివృద్ధి చేశారని తెలిపారు. మీరు దాని కంటే ఎక్కువ సంఖ్యలో నిధులు తీసుకొచ్చి ప్రజల హృదయాల్లో నిలిచే విధంగా చూడాలి తప్ప చేసిన వాటికి మరోసారి చేయడం సరికాదని అన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళిత బంధు, బీసీ బందు, మైనారిటీ బందు, గృహలక్ష్మి పథకాలను అమలు చేసే విధంగా చూడాలని సూచించారు. గతంలోనే కొందరు లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగిందని వారికి నిధులు వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. ఈ విషయంపై కలెక్టర్‌ను కలిసి విన్నవిస్తామని ఆయన అన్నారు.

గుంటూరు కారం డైరెక్టర్ క్షమాపణ చెప్పాలి

నవ తెలంగాణ-ఉట్నూర్

ఎన్నో ఉద్యమాలు, హక్కుల సాధనకు మార్క్స్ లెనిన్‌ను ఆదర్శంగా తీసుకుంటారని, అలాంటి గుంటూరు కారం సినిమాలో మాత్రం విలన్ పాత్రకు ఆయన పేరు పెట్టి తప్పుడు సమాచారం ఇస్తున్నారని, వెంటనే డైరెక్టర్ క్షమాపణ చెప్పాలని ప్రగతి శీల యువజన సంఘం జిల్లా కన్వీనర్ వాగ్మారే ప్రజ్ఞశీల్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కమ్యునిస్టు విప్లవకారులు, మార్క్సిస్టులు ఆయనను ఆదర్శంగా తీసుకుంటారన్నారు. కానీ గుంటూరు కారంలో మాత్రం విలన్‌కి ఆయన పేరు పెట్టి సమాజానికి తప్పుడు సంకేతం ఇస్తున్నారని మండిపడ్డారు. లెనిన్ మార్క్సిజంతో రష్యా దేశంలో విప్లవాన్ని విజయవంతం చేశారని గుర్తు చేశారు. దోపిడీ, పీడన, అణచివేత లేని సోషలిస్టు సమాజాన్ని ఏర్పరిచారని తెలిపారు. అలాంటి మహా నాయుడి పేరును గుంటూరుకారం సినిమాలో విలన్‌కి పెట్టడాన్ని ఖండిస్తున్నామన్నారు. అలాగే సినిమాలో అసభ్యకరంగా రాసిన మడతకుర్చీ బూతు పాటనుపెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. డైరెక్టర్ త్రివిక్రమ్, హీరో మహేష్ బాబు బహిరంగ క్షమాపణ చెప్పడంతో పాటు వాటిని తొలగించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలను చేపడుతామని హెచ్చరించారు.

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

న్యాయవాదుల సమస్యల పరిష్కరానికి తన వంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. గురువారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కోర్టు ఆవరణలోని వారి కార్యాలయంలో సత్కరించారు. పూలమాలలు వేసి శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం న్యాయవాదుల సమస్యలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఉన్నతమైన కుటుంబాల నుంచే లాయర్లు, వైద్యులు, ఇంజనీర్లు అయ్యేవారన్నారు. కానీ ప్రస్తుతం పేద కుటుంబం నుంచి లాయర్లు, ఇంజనీర్లు, వైద్యులు అవుతున్నారన్నారు. లాయర్లకు ఇండ్ల స్థలాలు ఇచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. ఇది వరకే ప్రభుత్వ భూముల వివరాలను సేకరించామన్నారు. త్వరలోనే పేదలకు పంపిణీ చేసేల చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్నాల నగేష్, న్యాయవాదులున్నారు.

పేదలపై పెట్టిన కేసులను ఎత్తివేయాలి

- సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జగిత్యాలలో గతేడాది క్రితం ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న పేదలపై పోలీసులు లాఠీచార్జీ చేయించి, గుడిసెలను ధగ్ధం చేసి, పేదలతో పాటు సీపీఐ(ఎం) నాయకులపై నాన్ బెయిలెబుల్ కేసులు పెట్టి, జైల్లో పెట్టడాన్ని ఖండిస్తూ సీపీఐ(ఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని సుందరయ్య భవనం ఎదుట ఆందోళన తెలిపారు. ఈ సందర్భంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలంటూ నినాదాలు చేస్తూ హోరెత్తించారు. అనంతరం రహదారిపై రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 60 చోట్ల ప్రభుత్వ భూముల్లో పేదలు గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారన్నారు. ఈ స్థలాలను రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జాలు చేస్తున్నారని, వారికీ వత్తాసు పలుకుతూ స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు పోలీసుల ద్వారా గుడిసెలు తగల బెట్టిస్తూ, కేసులు నమోదు చేయిస్తున్నారని ఆరోపించారు. మూడు రోజుల క్రితం జగిత్యాల, కోరుట్ల పట్టణ కేంద్రాల్లో గుడిసెవాసులపై దాడి చేసి, గుడిసెలకు నిప్పుపెట్టి, పేదలు, సీపీఐ(ఎం) నాయకులపై అక్రమ కేసులు పెట్టారన్నారు. గత ప్రభుత్వం ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వకపోవడంతోనే ఓటమి పాలైందన్న సంగతీ రాష్ట్ర ప్రభుత్వం గమనిస్తే మంచిదన్నారు. ఇప్పటికైనా అరెస్టు చేసిన వారిపై బేషరతుగా కేసులు ఎత్తివేయాలని, పేదలకు ఇండ్ల స్థలాలు పంపిణీ చేయాలనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, ప్రజాపంథా నాయకులు జగన్ సింగ్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు అన్నమొల్ల కిరణ్, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న, ఆర్.సురేందర్, ఆర్.మంజుల జిల్లా నాయకులు, ఎన్.స్వామి, లింగాల చిన్నన్న పాల్గొన్నారు.

గ్రూప్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ డిగ్రీ పాసైన అభ్యర్థులకు గ్రూప్-1,2,3,4 ఫౌండేషన్ కోర్సుకు ఉచిత కోచింగ్‌కు దరఖాస్తులు చేసుకోవాలని బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ గురువారం సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 20వ తేదీ వరకు స్టడిసర్కిల్.సీజీజీ.జీఓవీ.ఇన్ వెబ్ సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఉచిత శిక్షణ ఫిబ్రవరి 1 నుండి ప్రారంభమై నాలుగు నెలల పాటు కొనసాగుతుందన్నారు. గతంలో గ్రూప్స్ శిక్షణ తీసుకున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవద్దని, హాస్టల్ వసతి ఉండదని పేర్కొన్నారు. అభ్యర్థులకు ఆదాయ ధ్రువీకరణ పత్రం రూ.5లక్షల లోపు ఉండాలని, అభ్యర్థుల ఎంపిక విధానం రిజర్వేషన్, డిగ్రీ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా ఉంటుందని తెలిపారు. అమలులో ఉన్న నిబంధనల ప్రకారం స్టడీ మెటీరియల్ అందిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 08732-221280 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

జీపీ అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలి

- నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నవతెలంగాణ-నిర్మల్

గ్రామపంచాయితీల అభివద్ధి ప్రణాళికలు రూపొందించి ఈనెల 27లోగా గ్రామ సభలలో తీర్మాణాలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మండల అభివృద్ధి అధికారులను ఆదేశించారు. మండల్లో మోడల్ అంగన్‌వాడీ ఏర్పాటే చేసే సదుపాయాలు కల్పించాలన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఓరియంటెషన్ సమావేశం నిర్వహించారు. గ్రామపంచాయితీ అభివృద్ధి ప్రణాళికలు, తీర్మాణాలు, ఉపాధి హామీ పనులపై మండలాల వారీగా సమీక్షించారు. గ్రామాల అభివృద్ధికి శాఖల సమన్వయంతో 2024-25 సంవత్సరానికి గాను ప్రణాళికలు రూపొందించుకొని ఈనెల 27న గ్రామ సభల ద్వారా తీర్మాణాలు చేయాలన్నారు. 31లోగా ఆన్‌లైన్ ద్వారా సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. చేపట్టిన పనుల తీర్మాణాలను పరిశీలించి గ్రామ పంచాయితీలలో పూర్తి కాని పనులను జిల్లా, మండల స్థాయి అభివృద్ధి ప్రణాళికలు ద్వారా ఎంపీడీపీ ఫిబ్రవరి 7లోగా తీర్మాణించి 10లోగా అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. పారిశుద్యం, త్రాగునీరు, తదితర అవసరాలను తీర్మాణాలు చేపట్టాలని సూచించారు. ఉపాధి హామీ పనులలో ఎలాంటి అలసత్వం ఉండవద్దని, గ్రామాభివృద్ధికి ఏ పనులు చేపడితే బాగుంటుందో క్షేత్రస్థాయిలో పనులు గుర్తించాలని, పనులపై స్పష్టమైన అవగాహన ఉండాలన్నారు. స్వచ్ఛభారత్‌లో కార్యాలయాలలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. స్వచ్ఛ భారత్ పారిశుద్యం పనులపై ఇంటింటి సర్వే త్వరగా పూర్తి చేయాలని, మురికి కాలువల చివరి భాగంలో ప్రజలకు అవసరమైన కమ్యూనిటీ సోక్ పిట్స్ ఏర్పాటు చేసి పారిశుద్యం మెరుగుపరచాలని ఆదేశించారు. నర్సరీలలో మొక్కలు వంద శాతం బ్రతికేల సంరక్షణ చర్యలు పకడ్బందీగా చేపట్టాలన్నారు. ప్రతి శుక్రవారం వాటరింగ్ డే చేపట్టి మొక్కలు నీరందించాలన్నారు. మండల కార్యాలయాలు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, అలాగే ఉపాధి హామీ సంబంధించిన రికార్డులు, రిజిష్టర్ల నిర్వహణ సక్రమంగా ఉండాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జడ్పీ సీఈఓ సుధీర్, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, ఎంపీడీఓలు, ఎంపీఓలు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా రక్తదానం



రక్తదానం చేస్తున్న యువకులు

నవతెలంగాణ-మోపాల్

మండల కేంద్రంలో గురువారం బొబ్బ నరసింహారావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకొని మహాలక్ష్మి చికెన్ సెంటర్ పక్కన రక్తదాన శిబిరాన్ని ఆయన ఏర్పాటు చేసి దాదాపు 50 మంది యువకులు రక్తదానాన్ని లైన్స్ క్లబ్ ఆఫ్ సహారా వారి సహకారంతో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ ఎన్టీ రామారావు మరణించినా కూడా ఇప్పటికీ ప్రజల హృదయాల్లో నిలిచి ఉన్నాడని, ఆయన చేసిన సేవలు తెలుగు రాష్ట్రానికే గర్వ కారణమని అన్నారు. పేదవారికి రెండు రూపాయల కిలో బియ్యం పంపిణీ చేసి ప్రజలందరి మన్నన పొందిన మహనీయుడని తెలిపారు. సినీ రంగంలో కూడా ఆయన నటనకు ఎవరు సాటి రారని కొనియాడారు. ఈ సందర్భంగా అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నిమ్మగడ్డ తరుణ్, గంగా ప్రసాద్, శ్రీకాంత్, కొండపేటి కిరణ్, రఘు పటేల్, యువకులు పాల్గొన్నారు.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలో గురువారం పేకాట ఆడుతున్న నలుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్సై కే. గోపి తెలిపారు. ఎస్సై గ్రామంలోని ఆత్తర్ గల్లిలో మూడు ముక్కలు పేకాట డబ్బులతో బెట్టింగ్ చేస్తూ ఆడుతున్న నలుగురు పేకాటరాయుళ్లను పట్టుకొని వారి వద్ద నుండి 5420 రూపాయలు, 52 పేకాట ముక్కలను స్వాధీనపర్చుకోన్నామని చెప్పారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.